ప్రతిపక్షం

www.prathipaksham.in

ఆదివారం 15.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 326 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



షేక్ హ్యాండ్ పై ఆలోచిస్తాం 8



ప్రజలు ఇచ్చిన ఈ మద్దతు బాధ్యతను మరింత పెంచింది. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లాలి. రాబోయే ఏ ఎన్నికలైనా ఇదే స్ఫూర్తితో, ఇదే సమన్వయంతో ఎదుర్కోవాలి. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ప్రతి పథకం ప్రజలకు చేరేలా పర్యవేక్షణ పెంచాలి. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి.

\- సీఎం రేవంత్‌రెడ్డి

ఇది కలిసికట్టుగా పనిచేసిన ఫలితం

రెండేళ్ల ప్రజా పాలనపై ప్రజల ముద్ర

- అభివృద్ధి-సంక్షేమమే విజయ రహస్యం
- ఈ విజయంబాధ్యతను మరింత పెంచింది
- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి
- రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలి
- మంత్రులతో సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 14 : 'అందరం కలిసికట్టుగా, సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ మంచి ఫలితాలు సాధించాం' అని సీఎం స్పష్టం చేశారు. పార్టీ విజయం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేసిన నేతలు, కార్యకర్తలు, స్థానిక నాయకత్వాన్ని ప్రత్యేకంగా అభినందించారు. హైదరాబాద్‌లో జరిగిన కీలక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో విస్తృతంగా

...:: మిగతా 2లో

మున్సిపల్ ఎన్నికలు ట్రైలర్ మాత్రమే

అసలు రాజకీయ సినిమా ముందుంది



మేము త్వరలో రాజకీయ పార్టీగా మారబోతున్నామని ప్రకటించగానే బీఆర్ఎస్ నేతలు ట్రోలింగ్ ప్రారంభించారు. ఇప్పుడే కారుకూతలు కూయకండి. కొత్త తరహా రాజకీయాలకు ప్రజలు స్వాగతం పలుకుతున్నారని ఈ ఫలితాలు నిరూపించాయి. ప్రజలకు ప్రత్యామ్నాయం లేకపోవడం వల్లే కాంగ్రెస్‌కు ఓట్లు పడ్డాయి. ఉత్తర తెలంగాణలో బీజేపీకి అనుకూలంగా బీఆర్ఎస్ వ్యవహరించింది. ఈ ఎన్నికలను బీజేపీ–బీఆర్ఎస్ పొత్తుకు తొలి మెట్టుగా చూడాలి.

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

- ట్రోలింగ్‌కు తలొగ్గం.. త్వరలో పార్టీగా జాగృతి
- ఇప్పుడే కారుకూతలు కూయకండి
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై జాగృతి దాడి
- కొత్త రాజకీయాలకు కవిత పిలుపు
- బీజేపీ–బీఆర్ఎస్ పొత్తుపై అనుమానాలు
- 'నేనే రాజు అన్న ధోరణి వద్దు'
- రికౌంట్ పేరిట కాంగ్రెస్ అధికార దుర్వినియోగం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఫైర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 14: ఇది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై విస్తృతంగా స్పందించారు. ఆమెతో పాటు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్లతో కలిసి కవిత మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ఇంకా మిగిలే ఉందని కవిత స్పష్టం చేశారు. తాము త్వరలో రాజకీయ పార్టీగా మారబోతున్నామని ప్రకటించగానే బీఆర్ఎస్ నేతలు ట్రోలింగ్ ప్రారంభించారని, "ఇప్పుడే కారుకూతలు కూయకండి" అంటూ హెచ్చరించారు. కొత్త తరహా రాజకీయాలకు ప్రజలు స్వాగతం

...:: మిగతా 2లో



కాంగ్రెస్ ఖాతాలో వడ్డెపల్లి మున్సిపాలిటీ

- సీఎంను కలిసిన ఆల్ఇండియా పార్వర్డ్ బ్లాక్ కౌన్సిలర్లు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 14 : గద్వాల, జోగులాంబ జిల్లా వడ్డెపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ ఖాతాలో జమా అయ్యింది. వడ్డేపల్లి మున్సిపాలిటీకి చెందిన 8 మంది ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) కౌన్సిలర్లు శనివారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లి కలిశారు. వడ్డెపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో సీఎంతో భేటీ అయ్యారు. వీరంతా కాంగ్రెస్‌లో చేరడం ఖాయమైంది. దీంతో వడ్డెపల్లి మున్సిపాలిటీ సైతం కాంగ్రెస్ జెండా ఎగురనుంది. సీఎంను కలిసిన వారిలో కుర్వపావని 1వ వార్డు, శారద 2 వ వార్డు, మంజుల 4 వ వార్డు, యుగేందర్ రెడ్డి 5వ వార్డు, దేవమ్మ 6వ వార్డు, విజయ్ భాస్కర్ 7వ వార్డు, జయశ్రీ 8 వ వార్డు, ఎరుకల తిమ్మప్ప 10 వ వార్డు కౌన్సిలర్లు ఉన్నారు. ఈ భేటీలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ తదితరులున్నారు.



బంగ్లాదేశ్ ప్రధానిగా తారిఖ్ రహ్మాన్

- సార్వత్రిక ఎన్నికల్లో బీఎన్‌పీ గెలుపు
- పాలనా పగ్గాలు చేపట్టనున్న ఖలీదా జియా కుమారుడు
- 20 ఏండ్ల తర్వాత అధికారంలోకి

ఢాకా, ఫిబ్రవరి 13: లండన్‌లో 17 ఏళ్లపాటు స్వీయ ప్రవాస జీవితాన్ని గడిపిన తారిఖ్ రహ్మాన్ బంగ్లాదేశ్‌కు కొత్త ప్రధాని కానున్నారు. ఆయన తండ్రి స్థాపించిన పార్టీ 20 ఏండ్ల తర్వాత బంగ్లాదేశ్‌లో అధికారంలోకి వస్తున్నది. తాజాగా జరిగిన బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో తారిఖ్ రహ్మాన్ నాయకత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) 297 సీట్లలో 209 స్థానాలను కైవసం చేసుకొని స్పష్టమైన మెజారిటీ సాధించింది. మెజారిటీకి అవసరమైన 150 సీట్లను బీఎన్‌పీ అధిగమించడంతో బంగ్లాదేశ్ నూతన ప్రధానిగా బాధ్యతలు చేపట్టేందుకు బీఎన్‌పీ చైర్మన్, మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రహ్మాన్‌కు మార్గం సుగమమైంది. పాకిస్థాన్‌కు సన్నిహితమని భావించే 11 పార్టీల కూటమి జమాత్‌ఎఇస్లామీ 68 స్థానాలను గెలుచుకుంది. జమాత్ అధినేత షఫీఖుర్ రహ్మాన్ ఢాకా 15 స్థానంలో విజయం సాధించారు. మాజీ ప్రధాని షేక్ హసీనాకు చెందిన ఆవామీ లీగ్ పార్టీ ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధించారు. ఆవామీ లీగ్ 2008 నుంచి 2024 వరకు అధికారంలో ఉంది. కాగా, రెండు స్థానాల నుంచి పోటీచేసిన తారిఖ్ రహ్మాన్ రెండింటిలోనూ గెలుపొందారు. దాదాపు 17 ఏండ్ల ప్రవాస జీవితం తర్వాత గత డిసెంబర్‌లో ఆయన బంగ్లాదేశ్‌కు తిరిగివచ్చారు.

35 ఏండ్లలో తొలిసారి..

గడచిన 35 ఏండ్లలో బంగ్లాదేశ్‌కు మొదటిసారి పురుష ప్రధాని రానున్నారు. చివరిగా 1988లో కాజీ జాఫర్ అహ్మద్ ప్రధానిగా ఉన్నారు. ఆ తర్వాత 1991 నుంచి 2025 వరకు షేక్ హసీనా, ఖలీదా జియా దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారు. సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుని

...:: మిగతా 2లో

అరవింద్ విచారణకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్



ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో కీలక పరిణామం

ఈ కేసులో ఏ2గా ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 14: తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన ఫార్ములా ఈ కార్ రేసు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి కేటీఆర్, సీనియర్ ఐఏఎస్ అరవింద్ కుమార్‌తో పాటు పలువురు నిందితులుగా ఉన్నారు. తాజాగా ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. దీంతో కేసు విచారణలో ఏసీబీ మరింత దూకుడుగా వ్యవహరించనుంది. ఐఏఎస్ అధికారులను విచారించాలంటే కేంద్ర సిబ్బంది వ్యవహారాల విభాగం నుంచి అనుమతి తప్పనిసరి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములాఈ కార్ రేస్‌లో అవినీతి జరిగిందనే ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో ఏసీబీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన సంగతి తెలిసిందే. తాజాగా, ఈ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న

...:: మిగతా 2లో


రైతులకు సర్కార్ గుడ్‌న్యూస్!



రైతు భరోసా నిధులను విడుదలకు సన్నద్ధం

ఫిబ్రవరి 17 న ముహూర్తం?

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 14: తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే రైతులకు గుడ్ న్యూస్ చెప్పనుంది. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. యాసంగి సీజన్‌కు సంబంధించి.. రైతు భరోసా నిధుల విడుదలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎకరానికి రూ.6,000 చొప్పున అర్హులైన రైతులకు ఈ సాయాన్ని అందించనున్నారు. ఇందుకు ఫిబ్రవరి 17 తేదీని ముహూర్తంగా డిసైడ్ చేసినట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధుల విడుదలతో, పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించిన అంశాలపై మంత్రులతో చర్చించినట్లు సమాచారం. అలాగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల విజయం తర్వాత కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనేందుకు ప్రణాళికలు రచిస్తోంది.



కాంగ్రెస్‌తో దేశ భద్రతకు ప్రమాదమే

కాంగ్రెస్ ఎల్లప్పుడూ దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుందని ప్రధాని మోదీ ఆరోపించారు. దేశాన్ని ముక్కలు చేయాలని కలలు కనేవారిని, ఈశాన్య ప్రాంతాన్ని భారత్ నుంచి వేరు చేయాలని నినాదాలు చేసేవారిని హస్తం పార్టీ సమర్థిస్తుందని విమర్శించారు.

7



ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ ప్రారంభం

బంగ్లాదేశ్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన బీఎన్‌పీ నేత తారిఖ్ రహ్మాన్‌తో భారత ప్రధాని నరేంద్ర మోడీ ఫోన్‌లో మాట్లాడారు. పార్లమెంటరీ ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో రహ్మాన్ ను అభినందించారు.

7



మోడీ ప్రభుత్వం భ్రమలు కల్గిస్తోంది

అమెరికాతో మోదీ సర్కార్ చేసుకున్న ఒప్పందం కారణంగా దేశంలో వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ఆరోపించారు.

7



వీరుల త్యాగం భారతీయులకు స్ఫూర్తి

2019లో జరిగిన పుల్వామా దాడిలో అమరులైన సీఆర్‌పీఎఫ్ జవాన్లకు ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. వీరుల ధైర్యం, దేశభక్తి ప్రతి భారతీయుడికి ఇప్పటికీ స్ఫూర్తినిస్తోందని పేర్కొన్నారు.

7

రాష్ట్రీయం

ఇది కలిసికట్టుగా పనిచేసిన ఫలితం

మొదటిపేజీ తరువాయి

చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాన్ని సందర్భంగా మంత్రులందరినీ అభినందించారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేని అభివృద్ధి పనులను ప్రజా ప్రభుత్వం రెండేళ్లలో చేసి చూపించిందని సీఎం వ్యాఖ్యానించారు. ఈ రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని, తాజా మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఆ నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. "ప్రజలు ఇచ్చిన ఈ మద్దతు బాధ్యతను మరింత పెంచింది. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లాలి" అని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. రాబోయే ఏ ఎన్నికలైనా ఇదే స్ఫూర్తితో, ఇదే సమన్వయంతో ఎదుర్కోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతి పథకం ప్రజలకు చేరేలా పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పట్టణాభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రులకు సూచించారు.మున్సిపల్ ఫలితాలతో ఉత్సాహ భరితమైన కాంగ్రెస్ శ్రేణులు, ఇక ముందూ ఇదే జోరుతో ప్రజా పాలనను బలోపేతం చేస్తామని పేర్కొంటున్నాయి.

అరవింద్ విచారణకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

మొదటిపేజీ తరువాయి

సీనియర్ ఐఏఎస్ అరవింద్ కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్రం నుంచి అధికారికంగా అనుమతి వచ్చింది. ఈ విషయంపై తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సమాచారం ఇచ్చింది. ఫార్ములా ఈ రేసింగ్ ఒప్పందాల్లో నిబంధనల ఉల్లంఘన జరిగిందనేది ప్రధాన ఆరోపణ. ఇదే కేసులో మాజీ మంత్రి కేటీఆర్ విచారణకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించిన విషయం తెలిసిందే. తాజాగా ఐఏఎస్ అరవింద్ కుమార్ విషయంలో కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆయనపై కోర్టులో ఏసీబీ ఛార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు పూర్తి స్వేచ్ఛ లభించినట్టయ్యింది. కాగా, ఈ కేసులో ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ఏ2గా ఉన్నారు. ఈ రేసు ద్వారా హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తుందని, పర్యాటంగా అభివృద్ధి చేందుతుందని అప్పటి ప్రభుత్వం ముమ్మరంగా ప్రచారం చేసింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత భాగ్యనగరంలో నిర్వహించిన అంతర్జాతీయ ఈవెంట్లలో ఇది ఒకటి. అయితే, ముందు నుంచి ఈ రేసు నిర్వహణపై ఆర్థికపరమైన ఆరోపణలు వచ్చాయి. నిధులు దుర్వినియోగం, నిర్వహణకు సంబంధించిన టెండర్లలో అక్రమాలు జరిగినట్టు ప్రతిపక్షాలు, సామాజిక ఉద్యమ సంఘాలు విమర్శించాయి. ముఖ్యంగా ట్రాక్ నిర్మాణం, నిర్వహణ కోసం ప్రైవేటు సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాల్లో అవినీతి జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. రేసు వల్ల హుస్సేన్‌సాగర్ పర్యావరణం, దాని చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు కలిగిన అసౌకర్యంపై కూడా ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అలాగే, కేబినెట్ ఆమోదం లేకుండానే రూ.54 కోట్లు చెల్లించారనేది ప్రధాన ఆరోపణ. ఇప్పటికే ఈ కేసులో విజిలెన్స్ కమిషన్‌కు ఏసీబీ నివేదికను సమర్పించింది. అలాగే, ఈ వ్యవహారంపై ఈడీ కూడా కేసు నమోదు చేసింది.

బంగ్లాదేశ్ ప్రధానిగా తారిఖ్ రహ్మాన్

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నదని బీఎన్‌పీ నాయకుడు ఆమిర్ ఖుస్రూ మహమూద్ చౌదరి బీబీసీకి తెలిపారు. తారిఖ్ రహ్మాన్ తమ నాయకుడు, చైర్మన్ అని, బీఎన్‌పీ ప్రభుత్వంలో ఆయనే ప్రధానిగా ఉంటారని చౌదరి చెప్పారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో ఎంపీలు ప్రమాణం చేసిన తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందని ఆయన వెల్లడించారు.

తారిఖ్ రహ్మాన్‌కు మోదీ ఫోన్

బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బీఎన్‌పీ చైర్మన్ తారిఖ్ రహ్మాన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం నేరుగా ఫోన్‌లో శుభాకాంక్షలు తెలియచేశారు. రహ్మాన్‌తో మాట్లాడడం సంతోషంగా ఉందని ఎక్స్ పోస్టులో మోదీ తెలిపారు. అక్కడి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో తమ సహకారం ఉంటుందని రహ్మాన్‌కు తెలియచేసి, శుభాకాంక్షలు అందచేసినట్లు మోదీ పేర్కొన్నారు. సన్నిహిత పొరుగుదేశాలైన తమ మధ్య సుదీర్ఘ చారిత్రక, సాంస్కృతిక బంధాలు ఉన్నట్లు ఆయన చెప్పారు. శాంతి, ప్రగతి, బంగ్లాదేశ్ ప్రజల ఆకాంక్షల సాధనకు భారత్ సహకారం కొనసాగుతుందని ప్రధాని తెలిపారు.

ప్రవాస జీవితం నుంచి ప్రధాని దాకా..!

బ్రిటన్‌లో దాదాపు 17 సంవత్సరాలపాటు ప్రవాస జీవితాన్ని గడిపిన మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రహ్మాన్ ఈ ఏడాది జనవరి 25న బంగ్లాదేశ్‌కు తిరిగివచ్చారు. తన తల్లి ఖలీదా జియా మరణానికి ఐదు రోజుల ముందే ఆయన స్వదేశానికి తిరిగివచ్చారు. తన తల్లి మరణానంతరం ఆయన బీఎన్‌పీకి పూర్తిస్థాయి నాయకత్వ బాధ్యతలు స్వీకరించారు. 20012006 ఖలీదా జియా అధికారంలో ఉన్న సమయంలో ప్రభుత్వంలో రహ్మాన్ కీలక పాత్ర పోషించారు.



వేములవాడలో ఫ్రీ బస్సు ప్రారంభం

- రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలి
- భీమేశ్వర ఆలయంలో పూజలు
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి పరిశీలన
- సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ వేములవాడ, ఫిబ్రవరి 14: రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ ఆదేశించారు. శ్రీ భీమేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు వేములవాడకు రాగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. శ్రీ భీమేశ్వర ఆలయంలో అర్చకులు సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ కు స్వస్తితో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు స్వామి వారి ప్రసాదాన్ని అందజేసి, ఆశీర్వచనం అందించారు.

ఆలయ విస్తరణ పనుల పరిశీలన

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనులకు సంబంధించిన ఫోటోలు పరిశీలించారు. పనులపై పలు సూచనలు చేశారు.

ఉచిత బస్సు సర్వీసులు ప్రారంభం

వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి ఆలయం దాకా భక్తులను ఉచితంగా తరలించే ఆర్టీసీ బస్సులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రారంభించారు.

ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను ఒక ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ ఆదేశించారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ఆర్ అండ్ బీ, ఆలయ అధికారులు, ఆర్కిటెక్ట్ మూర్తి, కాంట్రాక్టర్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధాన ఆలయ విస్తరణ, ఇతర ప్రతి అభివృద్ధి పనికి సంబంధించి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. పనుల్లో వేగం పెంచాలని, అవసరమైన పనివారి సంఖ్య మరింత పెంచాలని ఆదేశించారు. పనుల పురోగతిలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. నాణ్యతతో పనులను పూర్తి చేయాలని సూచించారు. నూతన గోశాల నిర్మాణం, ఇతర అంశాలపై చర్చించారు. ఇప్పుడు ఉన్న గోశాలలో ఎన్ని కోడెలు ఉన్నాయని ఆరా తీశారు. వాటి సంరక్షణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ, గుడి చెరువు బండ్ పార్క్ పనులపై సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస్ రాజ్ కు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఏర్పాటు చేసి వివరించారు. సమావేశంలో ఆర్అండ్ బీ సీఈ రాజేశ్వర్, ఎస్ఈ రాములు ఈఈ నరసింహాచారి, ఆలయ ఈఈ రాజేష్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఎన్నికలు ట్రైలర్ మాత్రమే

మొదటిపేజీ తరువాయి

పలుకుతున్నారని ఈ ఫలితాలు నిరూపించాయని పేర్కొన్నారు. ప్రజలకు ప్రత్యామ్నాయం లేకపోవడం వల్లే కాంగ్రెస్‌కు ఓట్లు పడ్డాయని, ఇచ్చిన హామీలను ఎక్కడా అమలు చేయకుండానే ఎక్కువ స్థానాలు గెలుచుకుందని విమర్శించారు. కాంగ్రెస్ బడ్జెట్ లో హామీల అమలుకు తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రీకౌంటింగ్ పేరుతో అనేక చోట్ల కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆరోపించారు. బీఆర్ఎస్ గతంలో 90 శాతం మున్సిపాలిటీల్లో గెలిచిందని చెప్పుకుంటూ ఇప్పుడు కేవలం 16 మున్సిపాలిటీలకే పరిమితమైందని అన్నారు. కాంగ్రెస్ అపోజిషన్‌లో ఉన్నప్పుడు వచ్చిన ఫలితాలతో పోల్చుకోవడం సరికాదని, అధికారంలో ఉన్న సమయంలో కోల్పోయిన స్థానాలపై ఆ పార్టీ సమీక్షించుకోవాలని సూచించారు. ప్రజల ప్రేమను ఎందుకు కోల్పోయారో అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించారు. ఉత్తర తెలంగాణలో బీజేపీకి అనుకూలంగా బీఆర్ఎస్ వ్యవహరించిందని, ఈ ఎన్నికలను బీజేపీ-బీఆర్ఎస్ పొత్తుకు తొలి మెట్టుగా చూడాలని అన్నారు. కొత్తగూడెంలో సీపీఐ అడగకుండానే మద్దతు ప్రకటించడం వెనుక రాజకీయ లావాదేవీలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికుల హక్కులను కాలరాస్తున్న పార్టీలకు మద్దతివ్వడం నయవంచనగా అభివర్ణించారు. కాళేశ్వరం అంశంపై సాంబశివరావు చేసిన ఆరోపణల నేపథ్యంలో అదే పార్టీకే మద్దతివ్వడం అంటే ఆ ఆరోపణలను అంగీకరించినట్లేనని ప్రశ్నించారు. తాము ఫార్వర్డ్ బ్లాక్‌తో కలిసి పోటీ చేసి 40 స్థానాల్లో గెలిచామని, అధికారికంగా 33 స్థానాలు వచ్చినప్పటికీ బీ ఫారమ్ సమస్యల వల్ల మరో 7 చోట్ల తమ అభ్యర్థులే గెలిచారని వివరించారు. వడ్డేపల్లిలో ప్రజలు స్పష్టమైన మాండేట్ ఇచ్చారని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రలోభాలకు పాల్పడుతోందని ఆరోపించారు. నారాయణపేటలో వైస్ చైర్మన్ ఆఫర్ వచ్చినా దానిపై స్థానిక నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. గ్రామపంచాయితీ, మున్సిపల్ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చట్టాలను ఉల్లంఘించారని, ప్రభుత్వ ఖర్చుతో ప్రచారం నిర్వహించారని విమర్శించారు. ఎన్నికల సంఘం స్పందించలేదని, ప్రతిపక్షాలు కూడా ప్రశ్నించలేదని అన్నారు. "నేనే రాజు, నేనే మంత్రి" అన్నట్లుగా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని, రైతులకు ఇవ్వాల్సిన బోనస్ ముందుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల కోసం జాగృతి, హెచ్ఎంఎస్ మాత్రమే పనిచేస్తున్నాయని, రాబోయే సింగరేణి ఎన్నికల్లో కలిసి పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బొగ్గు బాయిల సంఖ్య తగ్గిందని, కార్మికుల సంఖ్య 60 వేల నుంచి 40 వేలకు పడిపోయిందని విమర్శించారు. యువత స్థానిక సంస్థల ఎన్నికలను రాజకీయాల్లోకి ప్రవేశానికి ప్రయోగంగా తీసుకోవాలని సూచించారు. గెలిచిన వార్డు సభ్యులు పార్టీల మాయలో పడి ప్రజా సమస్యలను మరిచిపోకూడదని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు చూస్తుంటే ప్రజలకు ఏ పార్టీపై పూర్తి నమ్మకం లేదని స్పష్టమవుతోందని, అందుకే జాగృతి కొత్త తరహా రాజకీయాలకు నాంది పలుకుతుందని కవిత అన్నారు. "

వడ్డేపల్లి విజయంపై గందరగోళం సృష్టించొద్దు

ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై స్పందించారు. అంబటి జోజిరెడ్డి మాట్లాడుతూ జాగృతితో కలిసి పోటీ చేసిన తమ పార్టీ అభ్యర్థులను ప్రజలు గెలిపించటం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులోనూ ఫార్వర్డ్ బ్లాక్, జాగృతి కలిసి పనిచేస్తాయని స్పష్టం చేశారు. వడ్డేపల్లిలో ఉద్యమ సంస్థ జాగృతితో కలిసి పోటీ చేసి మున్సిపాలిటీని గెలుచుకున్నామని, దీనిపై మీడియా గందరగోళం సృష్టించవద్దని కోరారు. కరీంనగర్‌లో బీజేపీకి అసలు మెజార్టీ రాలేదని, గెలిచిన తమ పార్టీ అభ్యర్థులకు కండువాలు కప్పి బీజేపీలోకి తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. నిన్న రాత్రి కేంద్ర మంత్రి బండి సంజయ్ స్వయంగా బెదిరింపులకు పాల్పడి ఒకరికి కండువా కప్పారని, అయినప్పటికీ వారు బీజేపీలో చేరలేదని, తమతోనే ఉన్నారని చెప్పారు. బండి సంజయ్ పరిధిలోని ఒక్క మున్సిపాలిటీని కూడా ఆయన గెలిపించుకోలేదని వ్యాఖ్యానించారు. 1939లో సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ వంటి చరిత్ర గల పార్టీ అభ్యర్థులను ఇండిపెండెంట్లుగా పేర్కొనడం అవగాహన లోపమని అన్నారు. కరీంనగర్‌లో బీజేపీ రూ.30 కోట్లు ఖర్చు చేసిందని, లేకపోతే ఆ పార్టీ గెలిచేది కాదని ఆరోపించారు. తమ పార్టీ ఒక్క పైసా ఖర్చు చేయకుండానే 40 సీట్లు సాధించిందని, డబ్బులతో కాదు సిద్ధాంతాలతో ముందుకు వెళ్లాలని తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

కార్మికుల కోసం కలిసి పోరాటం

హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ రామగుండం ఎమ్మెల్యే తమ అభ్యర్థులపై గుండాయిజం, రౌడీయిజం చేశారని ఆరోపించారు. గెలిచిన అభ్యర్థులకు కండువాలు కప్పి పార్టీ మార్పు చేయించే ప్రయత్నాలు జరిగినా వారు బెదరలేదన్నారు. ఉత్తర తెలంగాణలో సీపీఐ పని ముగిసిందని, ఒక్క సీటు కూడా గెలవలేదన్నారు. బీజేపీ ఒక్కటే సీటు గెలిచిందని తెలిపారు. జాగృతి తరపున 34 మంది పోటీ చేస్తే ఆరుగురు గెలిచారని, అదే బీఆర్ఎస్ నుంచి 60 మంది పోటీ చేస్తే 16 మంది మాత్రమే గెలిచారని పేర్కొన్నారు. సీపీఐ కార్మికుల విషయంలో పొంతనలేని ప్రకటనలు చేస్తోందని విమర్శించారు. భవిష్యత్తులో కోల్ బెల్ట్ ప్రాంతంలో నిజంగా కార్మికుల కోసం పనిచేసే వారినే ప్రజలు గెలిపిస్తారని అన్నారు. గతంలో కార్మిక హక్కుల కోసం కల్వకుంట్ల కవిత పోరాడారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బొగ్గు బాయిల సంఖ్య తగ్గిందని, కార్మికుల సంఖ్య 60 వేల నుంచి 40 వేలకు పడిపోయిందని విమర్శించారు. నైనీ బ్లాక్ కుంభకోణం కాంట్రాక్టర్ల మధ్య గొడవ మాత్రమేనని, అన్ని పార్టీలు కార్మికుల కోసం కాకుండా కాంట్రాక్టర్ల కోసం పని చేస్తున్నాయని ఆరోపించారు. రానున్న రోజుల్లో హెచ్ఎంఎస్, జాగృతి, ఫార్వర్డ్ బ్లాక్ కలిసి కార్మికుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో ఫార్వర్డ్ బ్లాక్ సెంట్రల్ కమిటీ సభ్యుడు ఆర్‌వీ ఆర్ ప్రసాద్, జాగృతి ప్రధాన కార్యదర్శి ఎల్.రూప్ సింగ్, ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, ఇస్మాయిల్, లోక రవిచంద్ర , భవానీ వేముల, లలిత యాదవ్, కొట్టాల యాదగిరి, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





మహాశివరాత్రికి భారీ ఏర్పాట్లు

- అందుబాటులో సమాచారం.. అన్ని సేవలు
- అన్ని మార్గాలు, రద్దీ ప్రదేశాల్లో చోట్ల సైన్ బోర్డ్ లు ఏర్పాటు
- క్యూలైన్లు ఇతర చోట్ల స్టీల్ గ్లాసుల్లో తాగునీటి వసతి
- బేబీ ఫీడింగ్ సెంటర్ అందుబాటులోకి..
- దివ్యాంగులు, వృద్ధులకు సహాయంగా వీల్ చైర్లు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ వేములవాడ, ఫిబ్రవరి -14 మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయి. అన్ని చోట్లా పూర్తి సమాచారం ఏర్పాటు చేశారు. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక ప్రణాళిక ప్రకారం జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పటికే అన్ని శాఖల అధికారులు ఆలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇలా ప్రతి చోట జిల్లా అధికారిని ఇన్చార్జిగా నియమించారు. అలాగే జాతర పరిసర ప్రాంతాల్లో 10 హెల్ప్ డెస్క్ లు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, సౌకర్యాలు, పారిశుద్ధ్యం, భద్రత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లపై ఇప్పటికే రెండు సార్లు సంబంధిత అధికారులతో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశాలు నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు.

బేబీ ఫీడింగ్ రూమ్

చిన్న పిల్లలతో వచ్చే తల్లులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకంగా బేబీ ఫీడింగ్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ గదుల్లో పరిశుభ్రమైన వాతావరణం, గోప్యత, కూర్చునే సదుపాయాలు కల్పించారు. తల్లులు ప్రశాంతంగా పిల్లలకు పాలు ఇవ్వడానికి ఈ సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది.

దివ్యాంగుల, వృద్ధుల కోసం వీల్ చైర్లు

దివ్యాంగ,వృద్ధ భక్తులు స్వామివారి దర్శనానికి సులభంగా చేరుకునేలా వీల్ చైర్ సౌకర్యం కల్పించారు. ప్రధాన ప్రవేశ ద్వారాలు, హెల్ప్ డెస్కుల వద్ద వీల్ చైర్లు అందుబాటులో ఉండేలా సిబ్బందిని నియమించారు. అవసరమైన సహాయాన్ని వెంటనే అందించేలా చర్యలు తీసుకున్నారు. దాదాపు 100 వీల్ చైర్లు అందుబాటులో ఉన్నాయి.

త్రాగునీటి కోసం స్టీల్ గ్లాసులు

భక్తులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించేందుకు ప్రత్యేకంగా స్టీల్ గ్లాసులను వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఈ ఏర్పాటు చేశారు. అన్ని త్రాగునీటి కేంద్రాలు, క్యూ లైన్లలో గ్లాసుల శుభ్రతపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.

సూచిక బోర్డులు

భక్తులు దారి తప్పకుండా దర్శన మార్గాలు, క్యూలైన్లు, మరుగుదొడ్లు, త్రాగునీటి కేంద్రాలు, హెల్ప్ డెస్కులను సులభంగా గుర్తించేలా స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. తెలుగులో బోర్డులు ఏర్పాటు చేసి భక్తులకు మార్గనిర్దేశం చేస్తున్నారు.

హెల్ప్ డెస్క్

భక్తుల సమస్యలు, సందేహాలకు వెంటనే స్పందించేందుకు 10 హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేశారు. దర్శన సమయాలు, వసతి, వైద్య సహాయం, దివ్యాంగుల సదుపాయాలు తదితర సమాచారం ఇక్కడ పొందవచ్చని అధికారులు తెలిపారు.

పారిశుధ్య నిర్వహణ

పంచాయితీ, మున్సిపల్ శాఖల సమన్వయంతో దేవస్థానం పరిసరాలు, ప్రధాన రహదారులు, క్యూలైన్లు, మరుగుదొడ్ల వద్ద పారిశుద్ధ్య పనులను విస్తృతంగా చేపట్టారు. చెత్త తొలగింపు, శుభ్రపరిచే పనులు నిరంతరంగా కొనసాగించేలా ప్రత్యేక సిబ్బంది, వాహనాలను నియమించారు. 24 గంటల పాటు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

వైద్య శిబిరాలు

భక్తులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. అత్యవసర చికిత్స, ప్రాథమిక వైద్య సేవలు, మందుల పంపిణీ కోసం వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అనారోగ్యం, గాయాలు తదితర సమస్యలు తలెత్తిన వెంటనే చికిత్స అందించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. గుడి ఆవరణలో వైద్య సిబ్బంది, అగ్ని మాపక సిబ్బంది ఉన్నారు.

కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ

జాతర ఏర్పాట్లు, సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సీసీ కెమెరాల సహాయంతో భక్తుల రాకపోకలు, క్యూలైన్లు, భద్రతా ఏర్పాట్లను సమీక్షిస్తూ, ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

"



మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన విజయలక్ష్మి రూపంలో జనసేన పుట్టిన తెలంగాణ గడ్డపై తొలి అడుగు పడింది. 2,998 స్థానాలున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో జనసేన పార్టీ 332 చోట్లే పోటీ చేసి ఓ కౌన్సిలర్, ఒక కార్పొరేటర్ స్థానం గెలిచింది. పార్టీ విజయ ప్రయాణం లేలేత అడుగులతో మొదలైంది.

- జనసేన చీఫ్‌పవన్‌కళ్యాణ్

రాజకీయం

మున్సిపల్ పరిధిలో ఓటరుగా ఉంటేనే..

- ఎక్స్అఫీషియో సభ్యుల ఓటు హక్కుపై ఎస్ఈసీ క్లారిటీ
- ఓటు లేని సభ్యులుగా అర్హులు కారు
- హైకోర్టు తీర్పు మేరకు కొత్త మార్గదర్శకాలు జారీ చేసిన ఎస్ఈసీ



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 14: మున్సిపల్ పరోక్ష ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన జారీ చేసింది. మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికల్లో ఎక్స్అఫీషియో సభ్యుల ఓటుహక్కుపై స్పష్టతనిచ్చింది. తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం2019 ప్రకారం.. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఇతర ఎక్స్అఫీషియో సభ్యులకు ఓటు హక్కు తప్పనిసరి అని తెలిపింది. మున్సిపల్ పరిధిలో ఓటరుగా నమోదు కానివారు ఓటు వేసేందుకు అనర్హులని సీఈసీ స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. మున్సిపల్ పరిధిలో ఓటరుగా నమోదు కాకుండా ఎక్స్అఫీషియో సభ్యులుగా ఓటువేసే వారిని అనర్హులుగా పరిగణిస్తారని, వారి ఓట్లు చెల్లవని న్యాయస్థానం తెలిపింది. ఈ నేపథ్యంలో కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు సీఈసీ సర్క్యులర్ జారీ చేసింది. నిబంధనలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించింది. దీంతో స్థానిక ఓటు హక్కు ఉంటేనే ఎంపీలు, ఎమ్మెల్సీలు.. మేయర్, ఛైర్ పర్సన్ పదవుల ఎన్నికల్లో ఓటువేసి ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. గతంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, రాజ్యసభ సభ్యులకు ఎక్కడ ఓటు హక్కు ఉన్నా తాము ఎంచుకున్న మున్సిపాలిటీలో ఎక్స్అఫీషియో సభ్యులుగా నమోదు చేసుకునే వారు. దీంతో తమ పార్టీకి తక్కువ మెజార్టీ ఉన్న చోట వీరంతా ఎక్స్అఫీషియో సభ్యులుగా ఓటు వేయడంతో ఆ పార్టీకి చైర్మన్, వైస్‌చైర్మన్ దక్కేది. తాజా హైకోర్టు ఆదేశాల మేరకు ఎస్ఈసీ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు సబంధిత మున్సిపాలిటీ పరిధిలో ఓటు హక్కు ఉన్న ఎక్స్అఫీషియో సభ్యులు మాత్రమే ఓటు వేస్తే అది చెల్లబాటు అవుతుందని స్పష్టం చేసింది.

మాట నిలబెట్టుకున్న జగ్గారెడ్డి!

- సంగారెడ్డి మున్సిపల్ ఛైర్ పర్సను కూన వనితా సంతోష్, వైస్ ఛైర్ పర్సన్ పదవిలో షేక్ షఫీ హఫీజ్
- సదాశివపేట మున్సిపల్ ఛైర్ పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ వైస్ ఛైర్ పర్సన్ రేణుకా చిరు
- ప్రజలకు ఇచ్చిన హామీలను తీరుస్తామని స్పష్టం చేసిన నిర్మల, జగ్గారెడ్డి



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 14: సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరింది. స్థానిక ప్రజలు జగ్గారెడ్డిని విశ్వసించారు. ఆయన నిలిపిన అభ్యర్థులను గెలిపించారు. ఈ రెండు మున్సిపాలిటీల్లోనూ సంపూర్ణ మెజారిటీ అందించారు. ఈనెల 16న మున్సిపల్ ఛైర్ పర్సన్లు, వైస్ ఛైర్ పర్సన్ల ఎన్నిక జరగనుంది. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు నిర్మల, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. సంగారెడ్డి మున్సిపల్ ఛైర్ పర్సను కూన వనితా సంతోష్, వైస్ ఛైర్ పర్సన్ షేక్ షఫీ హఫీజ్ ఉంటారని వెల్లడించారు. సదాశివపేట మున్సిపాలిటీలో ఛైర్ పర్సనుగా మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ ఛైర్ పర్సనుగా రేణుకా చిరు బాధ్యతలు చేపట్టనున్నారని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో సంగారెడ్డి, సదాశివపేట మినహా మిగతా చోట్ల అధికారికంగా ఛైర్ పర్సన్, వైస్ ఛైర్ పర్సన్ల పేర్లను ప్రకటించలేదు. కానీ ఇక్కడ మాత్రం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఎన్నికల కంటే ముందుగానే తమ పార్టీ తరపున ఈ పదవులు ఎవరికి ఇస్తామనే వివరాలను ప్రకటించారు. సంగారెడ్డిలో కూన సంతోష్, షేక్ షఫీ హఫీజ్ కు అవకాశం ఇస్తున్నామన్నారు. సదాశివపేటలో ఛైర్ పర్సనుగా మునిపల్లి సత్యనారాయణ, వైస్ ఛైర్ పర్సన్ అభ్యర్థిగా చిరు ఉంటారని చెప్పారు. ఆ మాట ప్రకారమే ఇప్పుడు వారికి అవకాశం కల్పిస్తున్నారు.

ప్రజలకిచ్చిన హామీలను..తప్పకుండా నెరవేరుస్తాం!

"కాంగ్రెస్ పార్టీ బరిలో నిలిపిన అభ్యర్థులను గెలిపించుకోండి. నేను మీకు పనులు చేసి పెడతా"అంటూ ఎన్నికల సమయంలో జగ్గారెడ్డి స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని పలు మార్లు ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిచిన వార్డుల అభివృద్ధికి నిధులు తీసుకొస్తానన్నారు. ఒక్కో వార్డు అభివృద్ధికి రూ.8కోట్ల మంజూరు చేయిస్తానన్నారు. ఈ రెండు మున్సిపాలిటీల్లోనూ పేదలకు ఇంటి జాగాలు ఇప్పిస్తానన్నారు. తాము ఎమ్మెల్యేగా లేకున్నా ప్రజలకు సంబంధించిన పనులు చేసి పెడుతున్నానని, దీనిని కొనసాగిస్తానని ఆయన తెలిపారు. ఆయన మాటలను జనం విశ్వసించారు. రెండు మున్సిపాలిటీల్లో స్పష్టమైన మెజారిటీ ఇచ్చారు. తాను ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తానని ఆయన ఇటీవలే ప్రకటించారు.





మహిళా స్వయం ఉపాధికి పెద్దపీట

ఎమ్మెల్యే వేముల వీరేశం

ప్రతిపక్షం, చిట్యాల, ఫిబ్రవరి 14: గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థిక స్వావలంబన, నైపుణ్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కేతేపల్లి మండలంలోని చెర్కుపల్లి, ఉప్పలపహాడ్, చీకటిగూడెం, కొత్తపేట, బొప్పారం, గుడివాడ, ఇనుపాముల, బండపాలెం, కొండకిందిగూడెం గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న మహిళా సమాఖ్య సంఘ భవనాలకు ఆయన శనివారం శంకుస్థాపన చేసి, పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు ఒకచోట చేరి సమావేశాల నిర్వహణకు, శిక్షణా కార్యక్రమాలు, స్వయం ఉపాధి పనులు చేపట్టడానికి ఈ భవనాలు వేదికలుగా మారుతాయని తెలిపారు. ప్రతి గ్రామంలో మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. తమ గ్రామాల అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యేకు మహిళలు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాజ్యాధికారం కోసం మాదిగలు సంఘటితం కావాలి

- మాజీ మంత్రి మోత్కులపల్లి నర్సింహులు



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 14: రాజ్యాధికారం కోసం మాదిగలు చైతన్యవంతులై సంఘటిత శక్తిగా ఎదగాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్ లోని ప్రతిమ హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో మాదిగ మేథావుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెపల్లి రాజేందర్ అధ్యక్షతన జరిగిన మాదిగ మహాశక్తి ఆత్మీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయాల పార్టీలను ఎంఐఎం పార్టీ నేత అసదుద్దీన్ ఒవైసీ శాసిస్తుండా, 12 శాతం జనాభా కలిగిన మాదిగలు వారి తరహాలోనే ప్రభుత్వాలను,రాజకీయ పార్టీలను శాసించాల్సిన అవసరం ఉందన్నారు. మాదిగలల్లో ఐక్యతను సాధించినప్పుడు ఇది సాకారమవుతుందన్నారు. అందుకే మాదిగల్లో ఐక్యతను పెంపొందించాలనే మహత్తర ఉద్దేశంతోనే మాదిగల మహాశక్తి ఆత్మయ సభలు నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు 50వేల వరకు ఉన్న ఎస్సీలంతా గంపగుత్తగా మనకే ఓట్లేసే స్థితికి రావాలన్నారు. మాదిగ దండోరా ఉద్యమంలో ఎంతో మంది మాదిగలు అమరులయ్యారని వివరించారు. ఎస్సీ వర్గీకరణ సాధనలో వారి పాత్ర మరువలేనిదని కొనియాడారు. అమరుల స్తూపం, కోటి రూపాయలు, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారని తెలిపారు. రాష్ట్రంలో అరకోటికి పైగా జనాభా ఉన్న మాదిగలు ఓట్లకే పరిమితమవుతూ అనాధలుగా బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం లేకపోవడమే మన జాతి వెనుకబాటు తనానికి కారాణమని పేర్కొన్నారు

అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలి : డాక్టర్ కవ్వంపల్లి

టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ,ఎస్టీలకు ఇచ్చిన అసైన్డ్ భూములపై పూర్తిస్థాయిలో హక్కులు కల్పిస్తూ వారికే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. అలాగే మూతపడ్డ లెదర్ పార్కులను తెరిపించడమే కాకుండా ఇంకా ఏర్పాటు చేయలేని లెదర్ పార్క్ ను ప్రారంభించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కొన్నిచోట్ల లెదర్ పార్క్ స్థలాలను లీజుకు ఇచ్చారని, వాటి లీజులు రద్దు చేసి పార్కులను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

మాదిగలు ఏకం కావాలి : మాజీ ఎంపీ పసునూరి

వరంగల్ మాజీ ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ మాదిగలను ఏకతాటి పైకి తీసుకురావడమే కాకుండా మన ఓట్ల మన జాతి బిడ్డలకే ఓట్ల వేయడం ద్వారా రాజ్యాధికారాన్ని పొందాలన్నదే మాదిగ మహాశక్తి ఆత్మీయ సదస్సుల ఉద్దేశమన్నారు. దీనిని ఒక రాజకీయ శక్తిగా రూపకల్పన చేయడం జరిగిందని అనేక సంవత్సరాలుగా విడిపోయిన మాదిగల అందరిని ఒక తాటిపైకి తీసుకువచ్చి ఈ ఉద్యమాన్ని బలోపేతం చేస్తామన్నారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ కనుకయ్య, ఎం విజయ్ కుమార్, గజ్జెల స్వామి, పల్లెల వీరస్వామి, డాక్టర్ కె.శ్రీనివాస, బొంకూరు శంకర్, ఎం. దేవేందర్, బండా శ్రీనివాస్ తోపాటు మేథావులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, మాదిగల సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు సీఎం శివరాత్రి శుభాకాంక్షలు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 14: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహా శివరాత్రి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆ మహా దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. మహా శివరాత్రి ఉపవాస పూజలను భక్తి ప్రవత్తులతో నిర్వహిస్తున్న భక్తులందరికీ శివయ్య ఆశీర్వాదం ఎల్లవేళలా ఉండాలని సీఎం ఆకాంక్షించారు.

రాష్ట్ర ప్రజలకు కేసీఆర్‌మహా శివరాత్రి శుభాకాంక్షలు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 14: మహాశివరాత్రి పర్వదినాన్ని పునస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో సుభిక్షంగా జీవించేలా దీవించాలని పరమశివుడిని ప్రార్థిస్తున్నట్టు కేసీఆర్ వెల్లడించారు. సహనానికి, త్యాగానికి ప్రతీక.. సృష్టిలయకారుడైన ఉమామహేశ్వరుడు హిందూ మత భక్తులచేత నిత్య పూజలందుకుంటారని గులాబీ బాస్ పేర్కొన్నారు. భక్తి శ్రద్ధలతో కొలిస్తే చాలు సామాన్య భక్తుల కోరికలూ తీర్చే భోళా శంకరునిగా భారతీయ ఆధ్యాత్మిక సామాజిక జీవనంలో పరమశివునిది ప్రత్యేక స్థానం అని కేసీఆర్ అన్నారు. ప్రాణకోటిని రక్షిస్తూ, సృష్టి మనుగడకోసం గరళాన్ని మింగిన మహా త్యాగి శంకరుడు.. ఆది యోగి, గరళకంఠుడు, ఆ పరమేశ్వరుడు అని కొనియాడారు. తెలంగాణ ప్రజలకు సుఖశాంతులు ప్రసాదించి, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందేలా దీవెనలు అందించాలని, దేవ దేవుడైన ఆ చంద్రశేఖరుడిని కేసీఆర్ ప్రార్థించారు.



పాఠశాలలో పుల్వామా అమర జవాన్లకు నివాళులు

ప్రతిపక్షం, చిట్యాల, ఫిబ్రవరి 14: చిట్యాలలోని గ్రీన్ గ్రో పాఠశాలలో పుల్వామా అమర జవాన్లకు శనివారం నివాళులు అర్పించారు. 2019 ఫిబ్రవరి 14న జరిగిన ఉగ్రదాడిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోయారని, వారి త్యాగాలను స్మరిస్తూ.. 'బ్లాక్ డే' గా నిర్వహిస్తామని పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్ రెడ్డి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సైనికుల దుస్తులు ధరించి ఈ కార్యక్రమంలో పాల్గొని అలరించారు. పాఠశాల ఏవో పోలా గోవర్ధన్, ఇతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి



ప్రతిపక్షం, చిట్యాల, ఫిబ్రవరి 14: నల్గొండ జిల్లా చిట్యాల మండలం నేరడ పంచాయతీ కార్యదర్శి మేకల వెంకటేశ్వరరావు (61) ఇవాళ గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. హైదరాబాద్ ఇమ్లిబన్ బస్టాండ్‌లో ఈ ఘటన జర్గగా పోలీసులు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇదే మండలంలోని ఏపూరులో గతంలో విధులు నిర్వహించారు. ఆయన ఈ సెప్టెంబర్‌లో రిటైర్డ్ కావలసి ఉంది. ఆయన మృతి పట్ల ఎంపీడీవో జయలక్ష్మి, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, నేరడ గ్రామపంచాయతీ పాలకవర్గం, సిబ్బంది సానుభూతిని తెలిపారు.

బంజారా భవన్లో నేడు సేవాలాల్ జయంతి

- పెద్ద ఎత్తున చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడి




ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 14: సేవాలాల్ బంజారా భవన్ లో లంబాడీ గిరిజనుల సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి ఘనంగా జరుగనుంది. ఈ జయంతి ఉత్సవాలలో రాష్ట్రముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, రాష్ట్రానికి చెందిన అందరు గిరిజన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక కార్పొరేటర్ తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని గిరిజన సంక్షేమ శాఖామంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా లంబాడీ గిరిజన సాంప్రదాయ పద్ధతి ప్రకారం సంత్ సేవాలాల్ ఆరాధన (భోగ్ భండార్) కార్యక్రమాలు, గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని, గిరిజన హస్తకళల ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మంత్రి అడ్లూరి మాట్లాడుతూ 2024 నాటి సేవాలాల్ జయంతి కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పటి వరకు వేడుకలకు ఖర్చు పెడుతున్న రూ. కోటిని రూ. రెండు కోట్లుగా రెట్టింపు చేయడమే కాకుండా బంజారా ఉద్యోగులకు ఉత్సవాలు జరుపుకోవడానికి వీలుగా ఫిబ్రవరి 15 నాడు ప్రత్యేక సెలవు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఈ నెల 15 నుంచి 21 వరకు అన్ని జిల్లాలలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో జరుగనున్న సేవాలాల్ జయంతి ఉత్సవాల నిర్వహణకై రాష్ట్ర ప్రభుత్వం రూ. రెండు కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, మీడియా మిత్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతూ అందరికీ ఆహ్వానం పలికారు.

బావను దారుణంగా చంపేసిన బామ్మర్దులు

- అడ్వకేట్ మహమ్మద్ ఖదీర్ ను కిరాతకంగా కత్తితో పొడిచి హత్య



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 14: నగరంలోని అత్తాపూర్‌లో అడ్వకేట్ మహమ్మద్ ఖదీర్ దారుణ హత్యకు గురయ్యారు. సులేమాన్ నగర్‌లోని తన సొంత ఆఫీసులో అడ్వకేట్‌పై కత్తులతో దాడి చేశారు. ఖదీర్‌ను మొదటి భార్య తమ్ముళ్లు అతి కిరాతకంగా చంపేశారు. పలుమార్లు కత్తితో పొడవడంతో తీవ్రంగా గాయపడిన ఖదీర్.. సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. దాడి జరిగిన వెంటనే నిందితులు పరారయ్యారు. అడ్వకేట్ ఖదీర్‌కు రెండు పెళ్లిళ్లు జరిగాయి. రెండో పెళ్లి చేసుకోవడంతో.. ఖదీర్ మొదటి భార్య ఇంటికి రావడం మానేశాడు. ఈ కోపంతో బావ ఖదీర్‌పై.. ఇద్దరు బామ్మర్దులు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఖదీర్ ఆఫీస్‌లో ఉన్న సమయంలో అక్కడకు వచ్చిన వారు మొదట రాడ్‌తో దాడి చేశారు. తలపై బలంగా కొట్టడంతో మహమ్మద్ ఖదీర్ కుప్పకూలిపోయాడు. ఆపై కత్తులతో ఆరుసార్లు పొడిచారు. దీంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ ఆధారాల సేకరిస్తోంది. ఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. అడ్వకేట్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుల కోసం విస్తృతంగా గాలిస్తున్నారు.



మైక్రోసాఫ్ట్ కోఫౌండర్ బిల్ గేట్స్ ఎల్లుండి రాష్ట్రానికి రానున్నారు. ఆయనను మూడుసార్లు ఏపీకి తీసుకొచ్చిన ఘనత తనదే. తొలిసారి హైటెక్ సిటీ, రెండోసారి విశాఖ అగ్రిటెక్, ఇప్పుడు సంజీవని పథకం కోసం పిలిపిస్తున్నాం. ఈ స్కీమ్ ద్వారా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో గ్రామీణ ఆరోగ్య సేవలు, వ్యాక్సినేషన్, మాతా శిశు సంరక్షణపై ఫోకస్‌చేస్తాం.
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

ఓపెన్ వాయిస్

అమెరికా ఒత్తిడికి భారత్ తలొగ్గిందా?

భారత్ -అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో భారత్‌పై అమెరికా టారిఫ్‌లు 18 శాతానికి తగ్గాయి. ఇక అదే సమయంలో అమెరికా భారత్‌పై మరో ఒత్తిడి పెంచింది. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు తగ్గించాలని ఆదేశించింది. భారత్‌తో సంబంధం లేకుండానే డొనాల్డ్ ట్రంప్.. భారత్ రష్యా నుంచి ఆయిల్ కొనుగోళ్లు తగ్గిస్తోందని ప్రకటించారు. అయితే దీనిపై భారత్ ఎలాంటి ప్రకటన చేయలేదు. మంత్రి పీయూష్ గోయల్ మాత్రం రష్యా ఆయిల్ కొనుగోలు ట్రేడ్‌లో భాగం కాదని ప్రకటించారు.భారత్ -అమెరికా మధ్య ఇటీవల మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరింది. దానికి ముందు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన 50% టారిఫ్‌లను 18%కి తగ్గించారు. వాణిజ్య ఒప్పందం తర్వాత ట్రంప్ కీలక ప్రకటన చేశారు. భారత్ రష్యా ఆయిల్ కొనుగోలు తగ్గించి అమెరికా, వెనెజువెలా నుంచి కొంటుందని ప్రకటించారు. దీనిపై భారత్ అధికారికంగా స్పందించకపోయినా, గణాంకాలు మార్పును నిర్ధారిస్తున్నాయి. పుతిన్ దీన్ని భారత నిర్ణయంగా గుర్తించారు.2025 డిసెంబర్‌లో రష్యా నుంచి 2.7 బిలియన్ డాలర్ల విలువైన ఆయిల్ దిగుమతి చేసుకుంది. నవంబర్‌లోని 3.8 బిలియన్ డాలర్ల విలువైన ఆయిల్ కొనుగోలు చేసింది. అంటే నెల రోజుల్లో ఆయిల్ దిగుమతి 27% తగ్గించింది. మొత్తం భారత ఆయిల్ దిగుమతిలో రష్యా వాటా 34% నుంచి 24.9%కి పడిపోయింది. 2024 డిసెంబర్‌తో పోల్చితే 15% కొనుగోలు తగ్గింది. 38 నెలలుగా రష్యా నుంచి జరుగుతున్న కొనుగోలులు ఇదే తక్కువ.అమెరికా నుంచి 2025 డిసెంబర్ దిగుమతులు 2024తో పోలిస్తే 31% పెరిగాయి. రష్యా నుంచి 15 శాతం తగ్గితే.. అమెరికా నుంచి దిగుమతి రెట్టింపైంది. వెనెజువెలా కూడా ప్రధానంగా చేరుతోంది. ఇది ట్రంప్ వాగ్దానాలకు సమానంగా ఉంది, కానీ ఆర్థిక లాభాలు ప్రశ్నార్థకం.రష్యా ఆయిల్ రవాణా ఖర్చు అమెరికా ఆయిల్ షిప్పింగ్ చార్జీలతో పోలిస్తే సగం ఉంటుంది. రష్యా నుంచి మనం రూపాయిల్లో కొనుగోలు (పెట్రో- రూపీ ఇన్వెస్ట్‌మెంట్) చేశాం. ఆ రూపాయలను కూడా రష్యా భారత్‌లోనే ఇన్వెస్ట్ చేసింది. అమెరికా నుంచి డాలర్లలోనే లావాదేవీలు జరుపుతున్నాం. ఇక అమెరికా నుంచి రవాణాకు భారత్ బ్యారెల్‌కు 4 నుంచి 5 డాలర్లు అదనంగా చెల్లించాలి. వెనెజువెలా ఆయిల్ కొటే బ్యారెల్‌కు 10 డాలర్లు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. రష్యా ఆయిల్ తక్కువగా వస్తున్నా.. అమెరికా ఒత్తిడి కారణంగానే మోదీ రష్యా ఆయిల్ తగ్గించి అమెరికా ఆయిల్ పెంచినట్లు చర్చ జరుగుతోంది.ఆయిల్ తగ్గుదల అమెరికా ఒత్తిడికి సూచన. తదుపరి రష్యా ఆయుధాలపై ఆంక్షలు, అమెరికా సామగ్రిని కొనుగోలు డిమాండ్ రావచ్చు. ఇది భారత విదేశాంగ వ్యూహాన్ని పరీక్షిస్తుంది.ఇదిలా ఉంటే భారత్‌కు రష్యా ఆయిల్ దిగుమతి తగ్గింది. 2024 డిసెంబర్‌తో పోల్చితే 2025లో 15% తగ్గుదల నమోదైంది. నవంబర్ -డిసెంబర్ మధ్య 27% తగ్గుదల.నమోదైంది. ఇక ఇదే సమయంలో అమెరికా దిగుమతులు 31% పెరిగాయి. దీంతో భారత్ అమెరికా ఒత్తిడికి తలొగ్గుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రష్యా, ఇరాన్ నుంచి బ్యారెల్ ఆయిల్ రవాణాకు షిప్పింగ్ చార్జి ఒక డాలర్ ఖర్చు అయ్యేది. అమెరికా, వెనెజువెలా నుంచి రవాణ చేయడానికి 3 నుంచి 5 డాలర్లవరకు కర్చు చేయాల్సి వస్తుంది. దీంతో భారత్‌పై రవాణా భారం మూడు రెట్లు పెరుగుతుంది. ఇక రష్యా, ఇరాన్ నుంచి భారత్ రూపాయల్లోనే ఆయిల్ కొనుగోలు చేస్తోంది. అమెరికా నుంచి కొనాలంటే డాలర్లలో కొనాలి. రష్యా రూపాయలను భారత్‌లోనే పెట్టుబడి పెట్టేలా రిజర్వు బ్యాంకు అవకాశం కల్పించింది. దీంతో మన దేశంలో పెట్టుబడులు పెరిగాయి.డాలర్‌లో కొనుగోళ్లు రూపాయి విలువపై ఒత్తిడి పెంచుతాయి. రష్యా వ్యవస్థ ఉపాధి అవకాశాలు, ఆర్థిక ప్రవాహాన్ని పెంచుతుంది. అమెరికా మార్పు దీర్ఘకాలిక ఖర్చులు పెంచి, ఆర్థిక సమతుల్యాన్ని భంగపరుస్తుంది.ఆయిల్ మార్పు భవిష్యత్ ఆయుధ కొనుగోళ్లలో అమెరికా ఒత్తిడికి దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇరాన్ ఆంక్షల్లా రష్యా మార్పు భారత వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని పరిమితం చేస్తుంది. చైనా, యూరప్ కొనుగోళ్లు కొనసాగుతుంటే భారత్ పై మాత్రమే అమెరికా ఒత్తిడి చేయడం గమనార్హం.స్వాతంత్ర్య నిర్ణయాలు ఆర్థిక ఒత్తిడికి గురవకూడదు.రష్యా ఆధారం తగ్గడం ధరల పెరుగుదలకు దారితీస్తుంది. ఆత్మనిర్భర్ ఎనర్జీ, వైవిధ్యమైన మూలాలు అవసరం. అమెరికాకు పూర్తి తలొగ్గడం దీర్ఘకాలిక ప్రమాదం. సమతుల్య వాణిజ్యం, ఆర్థిక స్వాతంత్ర్యం కీలకం.

ప్రతిపక్షం
హైదరాబాద్
ఆదివారం
15.02.2026

అలుపెరుగని యోధుడు లోక్ సత్తా శ్రీనివాస్

నరెడ్ల శ్రీనివాస్ అంటే తెలియక పోవచ్చు కాని, లోక్ సత్తా శ్రీనివాస్ అనగానే ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితమే. చాలా మంది ఆయనను లోక్ సత్తా శ్రీనివాస్ అనే పిలిచేవారు. సామాజిక న్యాయం, ఉద్యమాలకు ఆయన కేర్ ఆఫ్ అడ్రస్ గా నిలిచారు. ఉత్తర తెలంగాణలో గత ఆ నాలుగు దశాబ్దాలుగా కొనసాగిన సామాజిక ఉద్యమా లతో ఆయన భాగస్వామ్యం లేని ఉద్యమమే లేదంటే అతిశయోక్తి కాదు.




రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

లోక్ సత్తా ఉద్యమ సంస్థతో గత పాతికేళ్లుగా ఆయనకు విడదీయరాని సంబంధం ఉంది. లోక్ సత్తా అంటే శ్రీనివాస్. శ్రీనివాస్ అంటే లోక్ సత్తా అని పేరెన్నిక గన్నారు. అవినీతి, అన్యాయాలు అక్రమాలపై నిరంతరమైన పోరాటాలు చేశారు. ఎన్నో విజయాలు సాధించారు. కరీంనగర్ లో ఉన్న అన్ని ఉద్యమ వేదికలు ఆయనవే. గత సామాజిక ఉద్యమా లతో ఆయనకు విడదీయరాని బంధం సంబంధం అనుబంధం ఉన్నాయి. ఆయన ప్రతి ఉద్యమం లో క్రియాశీలక పాత్ర పోషించారు. వాస్తవానికి ఉద్యమాలను నిర్మించారంటే సమంజసంగా ఉంటుంది. ఉద్యమాల నిర్వహణలో అలు పెరగక, ఏనాడూ రాజీ పడక, మొక్కవోని ధైర్యంతో, చెక్కు చెదరని ఆత్మ విశ్వాసంతో, అకుంఠిత కార్యదీక్ష తో, అంకిత భావంతో, అన్నింటినీ మించి చిత్తశుద్ధితో, ఉద్యమాలలో మమేకమైన పోరాట యోధుడు.

1955లో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామంలో నిరుపేద కుటుంబంలో నరెడ్ల శ్రీనివాస్ జన్మించిన శ్రీనివాస్... యూనియన్ బ్యాంకులో ఉద్యోగం చేస్తూ, బ్యాంకు మేనేజర్ గా ప్రమోషన్ మీద కొంత కాలంగా రాష్ట్రం విడిచి వెళ్ళిన సందర్భంలోనూ, ఏనాడూ ఉద్యమ కార్యా చరణను ఆయన వదిలి పెట్ట లేదు. వినియోగదారుల మండలి తరపున వందలాది కేసులు వేసి హక్కులను పరిరక్షిం చేందుకు కృషి చేశారు. అవినీతి అధికారులను ఏసీబీకి పట్టించడం లో కృషి చేసిన వారిని సన్మానించి ప్రోత్స హించేవారు. పాలకుల తప్పులను, ప్రభుత్వ పాలసీల్లోని లోపాలను ఎత్తి చూపడంలో, ప్రజా సమస్యలతో పాటు, సామాన్య బాధితుల న్యాయం కోసం పోరాడ డంలో ఆయన వ్యక్తిత్వం అనన్య సామాన్యం.

ఉమ్మడి రాష్ట్ర వినియోగ దారుల మండలి అధ్యక్షుడిగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో అందరికీ అందు బాటులో ఉండేలా కిరాయి ఇల్లు వేదికగా, కరీంనగర్ వినియోగ దారుల మండలి నిర్వాహక బాధ్యునిగా, వేలాది కేసులను ఆయన పరిష్కరించారు. అన్యా యానికి గురైన వారు తమకు న్యాయం తప్పక జరుగుతుందని నమ్మకంతో,



లోక్ సత్తా ఆఫీసును వెతుక్కుంటూ వచ్చేవారు. వారి సమస్య పరిష్కారం అయ్యే దాకా సలహాలు సూచనలు అందించ డమే కాక, వెంట ఉండి సహకరించే వారు.

హుజురాబాదులో జన్మించిన 69ఏళ్ళ శ్రీనివాస్... విద్యార్థి జీవితం లోనే ప్రగతిశీల భావాలు కలిగి, ఆనాటి పోరాట, విప్లవ యోధుల సాహచర్యంతో ఎదిగారు. 1970వ దశక ప్రారంభంలో మిత్రులతో కలిసి హుజురాబాద్ లో సాహితీ సంస్థ స్థాపనకు చొరవ చూపి, మహాకవి శ్రీశ్రీని ఆహ్వానించి, హుజురాబాద్ లో సమావేశాలు నిర్వహించడంలో ప్రధాన పాత్ర పోషించారు.

కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్ కాలేజీలో డిగ్రీ, ఉస్మానియాలో పీజీ పూర్తి చేసి, కరీంనగర్ యూనియన్ బ్యాంక్ లో ఉద్యోగంలో చేరారు.

ప్రగతి శీల, భావజాల పరిధిని విస్తృత పరుచుకుని, తన లాంటి భావాలున్న వారితో జత కట్టారు. ఒకనాడు జర్నలిస్టులకు వేదికగా, ఎందరో జర్నలిస్టులను తయారు చేసి, జర్నలిస్టుల తయారీ కర్మాగా రంగా విలసిల్లిన, విజయ కుమార్ సంపాదకత్వంలో వెలువ రించిన 'జీవగడ్డ పత్రికలో వారం వారం 'పెన్నుపోటు' పేర కాలమిస్టు గా పని చేశారు.

ఆకాలంలో జీవగడ్డలో పని చేసిన అల్లం నారాయణ, ఘంటా చక్రపాణి, ఆనాడు జిల్లాలో విధులు నిర్వర్తించిన సీనియర్ జర్నలిస్టు మిత్రులు దేవులపల్లి అమర్, దామెర్ల సాయిబాబా, ఎస్. కే.జకీర్ తదితరులతో సాన్నిహిత్యాన్ని పెంచుకున్నారు.

కరీంనగర్ వినియోగదారుల మండలి స్థాపించి వినియోగ దారుల పరిరక్షణ చట్టం కింద, రశీదో, బిల్లో, ఏ చిన్న ఆధారం తోనైనా సరే, ఫోరం కోర్టుల్లో వేలాది కేసులు వేస్తూ మోస పోయిన వినియోగ దారులకు లక్షలాది రూపాయల నష్ట పరిహారాలు వచ్చేలా కృషి చేశారు. అలాగే సమాచార హక్కు చట్టాన్ని మరొక ఆయుధంగా చేసుకుని సామాన్యు లకు అండగా నిలిచారు. ఈ చట్టం కింద భూ కబ్జాలు, గ్రానైట్ రాళ్ళ సంభకోణాల లాంటివి బహిర్గత పరిచి, ప్రభుత్వానికి కోట్ల రూపాయల లబ్దిని చేకూర్చారు. లోక్ సత్తా బాధ్యునిగా, జయప్రకాష్‌నారాయణను కరీంనగర్ పలు మార్లు రప్పించి, చిత్తశుద్ధితో పని చేశారు. సమాజంలోని అవినీతి అక్రమాలపై అలు పెరుగని, అవిశ్రాం త పోరాటం చేసి, ఆశయ సాధనకు కృషిచేసిన పోరాట యోధుడు, నరెడ్ల చివరికి కరోనా మహమ్మారి తోనూ పోరాటం చేసి, ఓటమి పాలై, పోరాట యోధుని గానే 2021 ఫిబ్రవరి 15న తనువు చాలించారు. ఆయన పోరాటం ఎందరికో స్ఫూర్తి దాయకం అయిందనేది వాస్తవం.

నరెడ్ల శ్రీనివాస్ యాదిలో...
ఫిబ్రవరి 15... పోరాట యోధుని వర్ధంతి
(వ్యాసకర్త సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)



మనిషి మరణం

పల్లకి ఎక్కని మనిషి ఉంటాడో లేదో
తెలియదుగానీ...
పాడే ఎక్కని మనిషి మాత్రం ఉండడు.
జననం నుంచే జీవితం
మరణం వైపు నడిచే యాత్ర
వీధులంతా ఆశలతో నిండినా
చివరికి చేరేది
మౌనపు మృత్యువు ఒడిలోనే.
రాజ్యాలేలిన రాజైనా,
కష్టాల మట్టిలో పుట్టిన పేదైనా
శ్వాస విడిచే వేళ
అందరికీ ఒకటే దారి, ఒకటే పాడె.
పల్లకీల గర్వం క్షణికం,
పాడే నిజం శాశ్వతం
ప్రతి జీవికి మరణం సహజం,
అది తప్పించుకోలేని
జీవితానికి చివరి చరణం మనిషి మరణం.

కోట
దామోదర్
9391480475



బంజారాల ఆత్మగౌరవ చిహ్నం 'సేవాలాల్'



జటావత్ హనుము
8519836308

భారదేశ చరిత్రలో 18వ శతాబ్దం ఎంతో క్లిష్టమైనది. గొప్పగొప్ప రాజులు అంతరించారు. మరఠాలు శక్తివంతులవుతున్నారు. మరోవైపు బ్రిటిష్ వారు (ఈస్ట్ ఇండియా కంపెనీ) భారత్ ను తమ అధీనంలోకి తీసుకువచ్చే పని మొదలుపెట్టారు. మిషనరీలు క్రైస్తవ మతప్రచారం ముమ్మరం చేశారు. ఒక వైపు ఈ మూడు శక్తుల పోరాటం నడుస్తున్నది. అలాంటి పరిస్థితుల్లో బంజారా సమాజాన్ని సన్మార్గం లో నడిపించాడానికి సేవాలాల్ మహారాజ్ అవతరించారు. క్రైస్తవీకరణ సాగుతున్న సమయంలో బంజారాలలో హిందూ చైతన్యాన్ని పెంపొందించారు. భక్తి యుగంలో జన్మించిన మహాత్ములలాగా భక్తిని ప్రేరేపించారు. భక్తి ఆయుధంగా సంస్కరణ చేశారు. సమాజాన్ని సంఘటితం చేసి రాబోయే పరిణామాలను ముందుగా పసిగట్టారు. ఆ వీరుని జీవిత చరిత్ర అందరు తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. బంజారాలకి వున్నన్ని పేర్లు మరే తెగకి లేవు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో వ్యాపించిన తెగ కూడా ఇదే. అయినా సంస్కృతీ సంప్రదాయాలు, భాష, అంతటా ఒకటే జర్మనీ, హంగేరీ, ఆస్ట్రియ, రొమేనియ, ఉక్రెయిన్, వంటి చాలా యూరోపియన్ దేశాలలోని రోమాజిప్సీ బంజార ల తెగవారు తాము భారత దేశం నుండి వచ్చామని చెప్పుకుంటారు. ఆ రకంగా బంజారాలు పర దేశాల్లో కూడా జీవిస్తున్నారు. బంజారాలు తండాల్లో జీవిస్తారు. బంజారాల బతుకంతా నిత్యపోరాటమే వారు ప్రకృతితో, పరిసరాలతో పోరాడాలి నిత్య సంచారం వల్ల స్థానిక ప్రభుత్వాలతో పోరాడాలి ఇది వారి బతుకు,

కష్ట జీవులైన బంజారాలు తమ కుటుంబంతో ఊరూరా తిరుగుతు సరుకులు సరఫరా చేసేవారు. మధ్యకాలాల్లోని పృధ్వీరాజ్ చౌహాన్ సంతతి వారమని చెప్పుకునే బంజారాలు రాజస్థాన్ నుండి దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలివెళ్లారు. ఒకనాటి అఖండ భారత ఖండంలోని అఫ్ఘానిస్తాన్ గోర్ ప్రావిన్స్ ప్రాంతం నుండి మన దేశానికి వచ్చారని చరిత్రకారుల భావన. బంజారాలకు దైవాలు ఎక్కువగా లేరు. అలాంటి సందర్భంలో 1741లో తెలుగు నేల మీద జన్మించిన సంత్ సేవాలాల్ గురించి తెలుసుకోవడం అవసరం. బంజారాలు మొదటి నుండి వీరయోధులు బానిసత్వాన్ని వ్యతిరేకించడం వీరి నైజం. సంత్ గురు గోబింద్‌సింగ్‌తో ఉత్తర భారత దేశం నుండి వచ్చిన బంజారాలు కొంత మంది నాందేడ్ నుండి కన్నడ ప్రాంతానికి తరలివెళ్లారు. ఆనాడు కర్నాటక రాష్ట్రానికి చెందిన అనంతపురం జిల్లాలో ఉన్న గుత్తికి దగ్గర గల ప్రాంతంలో అలా తరలివచ్చిన వారి కుటుంబంలో సేవాలాల్ పుట్టాడు. అక్కడే సంత్ సేవాలాల్ పాత గుడి ఒకటి ఉంది. అతను బాల బ్రహ్మచారి బంజారా సమాజానికి ఒక దిశానిర్దేశం చేయాలని భావించాడు. తాము ఇక్కడకు వచ్చినప్పటి నుండి ఆంగ్లేయులు తమని కష్టాలకు గురిచేస్తున్న విషయం



గమనించాడు. వారు తమ కోసం వేసుకుంటున్న రైలు, రోడ్లు తమ రాకపోకలకు అంతరాయం కల్పించడం గమనించారు. పన్నులు వసూలు చేయడం కోసం కాంచీటీలు (డబ్బు రసీదు కేంద్రాలు) ఏర్పాటు చేయడం వారికి ఏమాత్రం రుచించలేదు. తమ వృత్తి మీద దెబ్బ కొట్టడానికే అలా చేస్తున్నారని భావించి వ్యతిరేకించారు. అలా వ్యతిరేకించిన బంజారాలను జైళ్లలో పెట్టడం, శిక్షల పేరుతో ఉరి తీయడం వారిని కలచివేసింది. అలా బ్రిటిష్ వారిని ఎదురొడ్డి నిలిచిన బంజారాలను 1871 లో వీరిని 'నేరస్థ జాతి'గా (క్రిమినల్ ట్రైబ్స్) పరిగణించడం బాధకు గురి చేసి తమ సంప్రదాయ వ్యాపారం దెబ్బ తినడం వల్ల గోవులను మేపుకుని బతకడమే బతుకుతెరువైంది. బంజరు భూములలో పశువులను మేపుకొన డానికి అధిక రుసుము వసూలు చేయడం మొదలైంది.

సేవాలాల్ ముందు గా బంజారా సమాజాన్ని సంస్కరించాలని అనుకున్నాడు. వ్యాపార సంచారం ఆపి వ్యవసాయం వైపు దృష్టిని మరల్చాలి. అలా సంచారమే జీవితమైనప్పుడు రుతువులను అనుసరించిన పండగలు, తన పూర్వీకులు వచ్చిన దారిలోనే నాందేడ్, (హైదరాబాద్ సంస్థానం), మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, పంజాబ్ ఒరిస్సా, మధ్యప్రదేశ్ వంటి ప్రాంతాలకు వెళ్లి సేవాలాల్ మహారాజ్ ప్రజల మేలు కోసం బోధనలు చేస్తు అనేక ఉద్యమాలు చేశారు. వీరిలో 'పెరిఫర్' ఒకటి. ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడులు అరికట్టడం, క్షేత్ర ధర్మాన్ని రక్షించడం మొదలైనవి. అహింస మహా పాపమని, మద్యం ధూమపానం శాపమని హితవు పలికాడు. ఒకప్పుడు హైదరాబాదులో మశూచి వ్యాధి ప్రబలింది. అయితే, సంత్ సేవాలాల్ మహారాజ్ ఉన్న బంజారా హిల్స్ ప్రాంతానికి మాత్రం ఆ వ్యాధి సోకలేదు. ఆయన మహిమను గుర్తించిన నిజాం రాజు సేవాలాల్ ఆశీస్సులతో ఆ వ్యాధిని నిర్మూలించాడని చరిత్ర తెలుపుతోంది. తిరుపతిలోని హాథీరాం బాలాజీ (18321928) వంటివారికి గురుతుల్యునిగా వున్న సేవాలాల్ బంజారా సమాజానికి తొలి ఆధునిక వేగు చుక్క. మారుతున్న కాలాన్ని బట్టి బంజారాలు ఆధునిక సమాజ పౌరులుగా తీర్చిదిద్దడానికి అతని సంచార జీవితమే ప్రధాన అనుభవ భూమిక అయింది. అయితే తమ మూలాలను కాపాడుకోవడానికి బంజారాలు చేసిన ప్రయత్నం తక్కువేమీ కాదు. గత సంస్కృతి, ఆధునిక అవసరాల మధ్య తమ జీవిత విధానాన్ని కాపాడుకున్నారు. ప్రకృతితో మమేకమై అందులోనే జీవించిన తెగ, ఇప్పుడు అందుకు దూరం కావడం వల్ల పరాయీకరణకు లోనవుతున్నారు. ఉన్నతీకరణ, సంస్కృతీకరణ ప్రభావంతో తమని తాము కోల్పోవాల్సి రావడం శాపమే. ఇది సేవాలాల్ బోధనలకి వ్యతిరేకం. సేవాలాల్‌ని ఒక దైవంగా మాత్రమే గుర్తించే చైతన్యానికి చేరువై, అతని అసలు సందేశాలను గుర్తించకపోవడం సేవాలాల్‌కి వ్యతిరేకం. దేశంలో వివిధ రాష్ట్ర లలో వివిధ పేర్లతో పేర్లతో పిలిచే లంబాడీ (బంజారా) లను ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి ఒకే దేశం ఒకే గిరిజన రిజర్వేషన్ కల్పించి వారి ప్రాచీన కాలం నాటి బాషా అయినా గోర్ బోలి ని భారత రాజ్యాంగ 8వ షెడ్యూల్ లో చేర్చి వారు దేశం కోసం చేసిన త్యాగాలను గుర్తించవలసి వలసిన అవసరం ప్రభుత్వాలపై ఉన్నది.

(సేవా లాల్ మహారాజ్ 287 జయంతి ఉత్సవాల సందర్భంగా..)
(వ్యాస రచయిత రీసెర్చ్ స్కాలర్ (OU) లెక్చరర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భూపాలపల్లి)



మదిని మీటే 'మిట్టపల్లి' గీతాలు



అంబీర్ శ్రీకాంత్
81859 68059

విలక్షణ పాటలను అందించే మట్టిలో మాణిక్యం 'మిట్టపల్లి సురేందర్'. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన రాసిన పాటలను ప్రజలు ఏ స్థాయిలో ఆదరించారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రతీ ఒక్కరి మదిని మీటేలా, ఆలోచన కలగడమే కాదు.. స్వచ్ఛంగా తమను ఆ పంక్తులలో సరిపోల్చుకునే స్థాయిలో గొప్ప సాహిత్యాన్ని, భావుకతను మిట్టపల్లి సురేందర్ తన పాటలలో సమకూర్చుతారు. 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రంలో సింగిల్ కార్డు సినీ గేయ రచయితగా ఆయన అందించిన పాటలు అన్నీ కిరాక్ సూపర్ హిట్ మాత్రమే.. కాదు.. ప్రేక్షకులు, సినీ ప్రియుల మదిలో నిలిచే ఆణిముత్యాలు. దర్శకుడు వేణు ఊడుగుల నిర్మాణ సారథ్యంలో సాయిలు కంపాటి దర్శకత్వంలో వచ్చిన 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్ర కథను మిట్టపల్లి సురేంద్ సంపూర్ణంగా ఆకళింపు చేసుకోవడమే కాదు. ప్రతీ పాటను రచిస్తున్న సందర్భంలో కథ ఆత్మను ఆవాహన చేసుకుని..పరకాయ ప్రవేశం చేసి మరీ పాటలను ఆవిష్కరింపజేశారు. తెలుగు సంగీత ప్రపంచంలో 'రాంబాయి నీ మీద నాకు మనసాయనే' అనే పాట చిరస్థాయిగా నిలిచిపోనుంది. ఇక ఈ పాటకు సురేష్ బొబ్బిలి సంగీతం మరో ప్రత్యేకత. 'చావులో కూడా బ్రతకడం ప్రేమికులకే తెలుసు' అంటూ మరో పాటలో కథ ఆత్మను చక్కగా ఒకే వాక్యంలో వివరించారు. 'కూడు కుంటూన్నది కొత్త పెళ్లి జంట' అనే పాటలో తెలంగాణ మాండలికపు మట్టి వాసనను ఘనంగా పరిచయం చేశారు. 'నాగులో నాగులా' అంటూ డ్యాన్సులు చేసే కుర్రాళ్ల సంబురాన్ని వెండితెరపైన దృశ్యరూపకంలో, శ్రవణానందం కలిగేలా.. 'ఎకరం పెట్టు పొక్కిలి' చేస్తామంటూ .. పెళ్లి బరాత్‌లో చేసే సందడిని వివరించారు. బతుకమ్మ మీద మిట్టపల్లి సురేందర్ రాసిన 'పచ్చిపాల వెన్నెలా నేలను పారబోసినట్లు పూ సేనే గునుగు పూల తోటలు.. ఎంతటీ అందాల మహారాణివే నీ చుట్టూ పూలన్నీ చెలికత్తెలే' అంటూ సాగే పాటలో ప్రకృతిని ఆరాధించడం .. ఎత్తుగడగా.. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని కవిగా, గాయకుడిగా, ఉద్యమకారుడిగా వివరించారు. అదే రీతిలో 'అలా అలా' అనే పాటలో 'ఆ మేఘం వీడి వస్తున్న చినుకులను.. ఓ క్షణమైనా ఆపగలదా నింగి ఆగమని', 'తేనె కంటె తియ్యంగా, అడవి కంటే అందంగా, కోయిలమ్మ పాడేటి పాటను ఆపగలదా అడవి.. పూలలో పుడుతూనే.. గాలిలో కలిసేటి.. పరిమళం తనలో దాచుకోగలద తోట..''.. అలా అలా నేను, నువ్వు ఒక్కటయ్యే రోజే వస్తే.. నిన్ను ఆపే అంతా బలం.. దేవుళ్లకైనా లేదంటా.. కథలోని సందర్భాన్ని ప్రకృతిలోని ప్రేమగుణాన్ని జోడించి.. వివరించారు. ప్రధాన స్రవంతియైనా సినిమా ల్లో మట్టి కవి మిట్టపల్లి సురేందర్.. పాటలు మరిన్ని రావాలని.. తెలంగాణ లోకల్ మాటలు గ్లోబల్‌గా ట్రెండ్ కావాలని 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా మాదిరిగా సింగిల్ కార్డులోనే సురేందర్ మరిన్ని పాటలను రాయాలని ఆకాంక్షిస్తున్నాం.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

కరీంనగర్ మేయర్ పీఠంపై బీజేపీ గురి

- బీజేపీలో చేరిన మరో ఇద్దరు ఇండిపెండెంట్ కార్పొరేటర్లు
- 35కు చేరిన బీజేపీ బలం



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 14: కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థులుగా పోటీ చేసి గెలుపొందిన ఇద్దరు కార్పొరేటర్లు కొద్దిసేపటి క్రితం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత చంద్రశేఖర్, 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేశ్ ఈరోజు హైదరాబాద్ కు విచ్చేసి బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. వారిద్దరికీ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కాషాయ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. నిన్న(శుక్రవారం) రాత్రి ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే 1 ఇండిపెండెంట్, మరో ఏఐఎఫ్ బీ కార్పొరేటర్ కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి విచ్చేసి బండి సంజయ్ సమక్షంలో పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. తాజాగా మరో ఇద్దరి చేరికతో బీజేపీ బలం 34కు చేరింది. ఎక్స్ అఫిషియో హోదాలో స్థానిక ఎంపీ బండి సంజయ్ కు కూడా ఒక ఓటు ఉంటున్నందున మొత్తం బీజేపీ బలం 35కు చేరింది. వీరు గాకుండా మరో ఆరుగురు కార్పొరేటర్లు బీజేపీ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీకి మేయర్ పదవి దక్కడం ఖాయమైంది. దీనిని దృష్టిలో ఉంచుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కు చెందిన కార్పొరేటర్లు, ఇండిపెండెంట్ కార్పొరేటర్లు బీజేపీలో చేరే అంశంపై తర్జన భర్జన పడుతున్నారు. కరీంనగర్ లో అభివృద్ధి పనుల కోసం కేంద్రం నుండి అధిక నిధులు వస్తుండటం, బీజేపీలో చేరితేనే తమ తమ డివిజన్ లో ఎక్కువ అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మరింత దగ్గర కావొచ్చనే భావనతో బీజేపీ ముఖ్య నేతలతో మంతనాలు జరుపుతున్నారు. కాంగ్రెస్ గత రెండేళ్ల పాలనలో కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం... రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడం...వంటి అంశాలను దృష్టిలో ఉంచుకున్న ఆయా కార్పొరేటర్లు కాంగ్రెస్ లో చేరితే పెద్దగా ఒరిగేదేమీ ఉండదనే అభిప్రాయానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీలో చేరే కార్పొరేటర్ల సంఖ్య అనూహ్యంగా పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.





గులాబీ గూటికి ముగ్గురు స్వతంత్ర కౌన్సిలర్లు

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే జిఎంఆర్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 14 : ఇంద్రేశం, ఇస్నాపూర్, జిన్నారం మున్సిపల్ పరిధిలో స్వతంత్ర అభ్యర్థులుగా విజయ సాధించిన ముగ్గురు కౌన్సిలర్లు పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు కౌన్సిలర్ ఎల్లకొండ రాహుల్ రెడ్డి, ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు కౌన్సిలర్ సార లావణ్య, జిన్నారం 9 వ వార్డు లో గెలుపొందిన స్వతంత్ర అభ్యర్థులు శ్రీలత నాగరాజు లకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శకత్వంలో పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ప్రజల ఆశీర్వాదం, కార్యకర్తల కృషితో పటాన్ చేరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలలో బిఆర్ఎస్ పార్టీ అధికారం చేపట్టబోతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.



నా జీవితం సురంగల్ గ్రామానికి అంకితం

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 15: నా జీవితం సురంగల్ గ్రామ ప్రజలకు అంకితమని 13వ వార్డు కౌన్సిలర్ గడ్డం లక్ష్మీ వెంకట్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో 13వ వార్డు నుండి తనను 84 ఓట్ల మెజార్టీతో గెలిపించడం నాకు సంతోషంగా ఉందన్నారు. ప్రజల విశ్వాసాన్ని, నమ్మకాన్ని వమ్ము చేయకుండా వార్డు అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తానని తెలిపారు. రాజకీయాలకతీతంగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఊపిరి ఉన్నంత వరకు ప్రజలకు సేవచేస్తానని వివరించారు.





ఓఆర్అర్ సర్వీస్ రోడ్డు లో కారు పల్టీ , యువకుడు మృతి

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 14 : పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తెల్లవారు జామున 3 గం. సమయంలో పోచారం నక్కవాగు మూల మలుపు వద్ద అతివేగం గా వచ్చిన చెట్టును ఢీకొట్టి పల్టీ కొట్టిన బొలెరో కారు ప్రమాద ఘటనలో ఇంద్రేశానికి చెందిన ఎం.డి. ముజీబుద్దీన్(29) మృతి చెందగా అస్లాం, చంద్రశేఖర్, నిత్యానంద్ లకు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న స్థానికులు ఘటన స్థలం నుండి ముజీబుద్దీన్ ను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మార్గ మధ్య లోనే మరణించ ముజీబుద్దీన్ మరణించదని, ఆయనతో కారు లో ప్రయాణించిన వారికి మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారాని మృతుని తండ్రి జైనులబుద్దీన్ ఇచ్చిన పిర్యాదు తో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పఠాన్ చేరు పోలీస్ లు తెలిపారు.



ప్రతిపక్ష పాత్రలో ప్రజల పక్షాన నిలబడతాం

- బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్లహరి శంకర్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 14: నగర పాలక సంస్థ ఎన్నికల తీర్పును గౌరవిస్తూ, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడతామని , నగర ప్రజల సమస్యలపై రాజీ పడకుండా పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. శనివారం కరీంనగర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నగర ప్రజల తీర్పును శిరసావహిస్తున్నామని, తమను ఆదరించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్లో బీజేపీ సాధించిన 30 సీట్లలో 11 మంది మాజీ బీఆర్ఎస్ అభ్యర్థులే ఉన్నారని, ఇతర పార్టీల నేతలను చేర్చుకుని గెలవడం బీజేపీ నైతిక విజయం కాదని విమర్శించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఇతర మున్సిపాలిటీల్లో బీజేపీ పరాజయం పాలవ్వడం కేంద్ర మంత్రి బండి సంజయ్ వైఫల్యమేనని ఎద్దేవా చేశారు.మేయర్ ప్రమాణ స్వీకారానికి ముందే బండి సంజయ్ ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని హరిశంకర్ డిమాండ్ చేశారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ అవినీతికి పాల్పడిందని ఆరోపించిన సంజయ్, అదే పార్టీకి చెందిన వారిని బీజేపీలో ఎలా చేర్చుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థికి రూ.50 లక్షలు ఖర్చు చేశారని ఆరోపిస్తూ, ఆ నిధులు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు వెల్లడించాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్ జక్కని ఉమాపతి బిఆర్ఎస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు చేతి చంద్రశేఖర్, తొంటి రాజేందర్ రాచకొండ నరేష్ అనుమల్ల ఉమా శంకర్ దూలం సంపత్ గౌడ్ నాగుల కిరణ్ కుమార్ గౌడ్ దుర్గం శ్రీకాంత్ గౌడ్ మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ముస్తాబైన నాళేశ్వర్ శ్రీ రాజరాజేశ్వర ఆలయం

- వేములవాడలో మాదిరిగానే ఇక్కడ కోడెదూడలు వదిలి మొక్కలు నెరవేర్చుకోనున్న భక్తులు
- గోదావరి నది తీరాన వెలసిన శివలింగం



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 14 : నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం నాళేశ్వర్ గ్రామంలో సుమారు 600 సంవత్సరాల క్రితం స్వయంభుగా వెలసిన రాజరాజేశ్వర స్వామి ఆలయం. ఈ గ్రామం మొత్తం ఎస్సారెస్పీ ముంపు ప్రాంతంలో మునిగిపోయినప్పటికీ ఆలయం మాత్రం భక్తుల కొంగుబంగారంగా విరజిల్లుతోంది. వేములవాడలో కొలువైన శివయ్య నాళేశ్వర్ లో కొలువైన శివయ్య రూపాలు ఒకటే కలిగి ఉండడంతో ఈ శివయ్యను అన్నగా వేములవాడ లో వెలిసిన శివయ్యను తమ్ముడిగా కొలుస్తారని ఈ గ్రామస్తులు చెబుతున్నారు. గోదావరి నది తీరన అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలసిన ఈ శివాలయానికి ప్రతి శివరాత్రికి భక్తులు మహారాష్ట్ర తో పాటు నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాలు తదితర ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు తరలివస్తుంటారు. వేములవాడ ఆలయంలో మాదిరిగానే ఇక్కడ కూడా కోడేదోడలను తిప్పడం ఆనవాయితీగా వస్తుంది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పండుగ రోజున సాయంత్రం షావామూర్తులతో ఊరేగింపుగా మందిరానికి తీసుకువెళ్లి ఆరోజు రాత్రి అంతా జాగరణ చేస్తారు. అలాగే మరుసటి రోజు అన్నదాన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలను, జాతరను నిర్వహించడం జరుగుతుంది. దాదాపు ఈ మహాశివరాత్రి సందర్భంగా నాళేశ్వర్ గ్రామానికి సుమారు మూడు లక్షల నుంచి నాలుగు లక్షల వరకు భక్తులు రావడం జరుగుతుంది.

ఆలయానికి వందల యేండ్ల చరిత్ర



మా నాళేశ్వర్ గ్రామంలో గోదావరి నది ఒడ్డున వెలిసిన ఈ నాళేశ్వర్ రాజరాజేశ్వరాలయానికి వందేళ్ల చరిత్ర ఉంది. అప్పట్లో గోదావరి నది పుణ్యస్థలంలో ఋషుల తపస్సుతో స్వయంభు లింగంగా ఉద్భవించినట్లు పురాణ గాథలు చెబుతున్నాయి. త్రేతా యుగంలో శ్రీరామచంద్రుడు తన వనవాస సమయంలో గోదావరి తీరంలో గల ఈ పుణ్య క్షేత్రంలో సాయం సంధ్య వేలాల్లో పూజలు చేసేవాడని ద్వాపర యుగంలో పాండవులు సైతం ఈ శివ లింగాన్ని దర్శించుకున్నారని ఆలయ పురాణంలో ఉంది.

మగ్గరి హన్మండ్లు మాజి సోసైటి చైర్మన్

ముంపు గ్రామమైనా ప్రత్యేకత ఉంది



గత 40 సంవత్సరాల కింద మా నాళేశ్వర్ గ్రామం ఎస్ ఆర్ ఎస్ పి .ముంపు గ్రామంగా ప్రకటించబడింది. మా గ్రామస్తులంతా ఐక్యమత్యంతో ఉండి మేము నమ్ముకున్న ఈ శివాలయాన్ని వదిలి మేము ఎక్కడికి పోమని ఒక సంకల్పంతో ఇక్కడే ముంపు గురైన కొన్ని కిలోమీటర్ల దూరంలోనే తమ సొంత డబ్బులతో భూములు కొనుక్కొని ఇక్కడే స్థిరపడడం జరిగింది, ఈ మహాశివరాత్రి సందర్భంగా మా గ్రామంలో స్వయంభుగా వెలిసిన శివాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి మీ మొక్కలు తీర్చుకోవాలి.

ఆర్మురు లావణ్య సర్పంచ్

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు



గ్రామంలో ఈ శివరాత్రి పండుగను గ్రామబివృద్ధి కమిటి ఆధ్వర్యంలో నిర్వహిస్తాం. శివరాత్రి రోజున ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు సాయంత్రం ఆగోరాల చేత షావామూర్తులను ఊరేగింపుగా, మందిరానికి తీసుకువచ్చి ఆర్రుజు రాత్రంత జాగరణ చేయడం జరుగుతుంది. ఈసారి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని తెలియడంతో ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా మా గ్రామబివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను దగ్గర ఉండి చూసుకుంటున్నాం

మనేద సురేష్, గ్రామబివృద్ధి కమిటి సభ్యుడు



కాంగ్రెస్ బెదిరింపులపై డీసీపీకి బీజేపీ ఫిర్యాదు

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 14: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది వ్యక్తులు బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థులను బెదిరించాలని చూస్తున్నారని శనివారం మంచిర్యాల డిసిపి డీసీపీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలలో బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థులను తీవ్రంగా బెదిరింపులకు గురి చేయడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో బెదిరింపులకు పాల్పడుతుందని తెలిపారు. పట్టణంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తుందని అన్నారు. ఇకపై ఇలాంటి భయానక వాతావరణం నుండి పోలీస్ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరబెల్లి రఘునాథరావు, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర గౌడ్, పట్టణ అధ్యక్షుడు అమీర్ శెట్టి, రాజకుమార్, బింగి ప్రవీణ్ లతోపాటు బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కల్మా చదివి ఎంఐఎంతో పొత్తు పెట్టుకోవాలి

- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కు ఎంపీ అరవింద్ సూచన
- ప్రతిపక్షంలోనే ఉంటాం కాంగ్రెస్ ఓ బ్రోకర్ పార్టీ
- కాంగ్రెస్ ఎంఐఎం పొత్తు పై వ్యాఖ్యాలు
- సీఎం రేవంత్‌పై ఓటుకు నోటు కేసు ఏమైందని ప్రశ్న



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 14 : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి విషయంలో కాంగ్రెస్ ఎంఐఎం పార్టీల పొత్తుపై జిల్లా ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన వ్యాఖ్యాలు చేశారు. మున్సిపల్ ఎన్నికల ముందు పీసీసీ అధ్యక్షుడు మహేష్కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ బీజేపీను ఎంత దూరం పెట్టిందో ఎంఐఎం పార్టీను అంతే సమదూరంలో పెడుతుందని అన్నారు. కానీ, ఇప్పుడు మేయర్ పదవి కొరకు పొత్తు పెట్టుకునేందుకు సిద్ధం అయ్యింది. దానికి ముందు పీసీసీ చీఫ్ కల్మా చదివాకే ఎంఐఎంతో పొత్తు పెట్టుకోవాలని సూచించారు. శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీకి మేయర్ పదవికి కావల్సిన స్థానాలు రాలేదని అందుకే ప్రతిపక్షంలోనే కొనసాగుతూ నగర అభివృద్ధి కొరకు పోరాడుతామని స్పష్టం చేశారు. 42 శాతం మైనార్టీలు ఉన్న నగరంలో 28 సీట్లు గెలువటం భారీ విజయంగా అభివర్ణించారు. కాంగ్రెస్కు 17, ఎంఐఎంకు 14 సీట్లు వచ్చాయి. మేయర్ పదవి చేపట్టేందకు 31 సరిపోతుంది. కాంగ్రెస్ ఎంఐఎం ల పొత్తు ఎంతకాలం ఉంటుందో చూస్తామన్నారు. తమ పార్టీ అభ్యర్థులు నలుగురు కొద్ది తేడాతో ఓడిపోయారని లేకుంటే తమదే మేయర్ పీఠం అన్నారు. ఒక సీటు గెలిచిన బీఆర్ఎస్ కార్పొరేటర్ ఇంటిముందు ఏసీపీ, నలుగురు ఎస్సైలు ఎందుకు బందోబస్తు ఉన్నారు. ఆ కార్పొరేటర్ ను ఎత్తుకుపోయే అవసరం కాంగ్రెస్కు ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఓటుకు నోట్ కేసు విచారణ మెల్లగా సాగుతోంది ఎందుకు విచారణలో జాప్యం జరుగుతుందో పరిశీలిస్తామన్నారు. ఈ కేసులో ఉన్న సీఎం రేవంత్ ను పోలీసులు ఎత్తుకుపోవాలన్నారు. గెలిచిన వారిని ఎత్తుకుపోయే టీఆర్ఎస్ నామరూపం లేకుండా అయ్యింది. ఇప్పుడు కాంగ్రెస్ అదే పనిచేస్తుంది కాబట్టి వారికి అదే గతి పడుతుందన్నారు. నిజామాబాద్ పోలీసులు నాపై కేసు పెట్టారు. కానీ నేనే వారిపై మా అభ్యర్థిని పోలింగ్ బూత్ నుంచి బయటకు పంపినందుకు కేసు పెట్టాలన్నారు. నిజామాబాద్లో 28 సీట్లు రావటం చాల సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. నిజామాబాద్ లో తాము గెలిచే కొన్ని స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గత ఎన్నికల్లో ఓడిపోయారనే సింపతితో వారికి ఓటువేశారని అన్నారు. మా నాన్న డి శ్రీనివాస్ కాంగ్రెస్ కు చెందిన వ్యక్తి అయినప్పటికి నేను కాంగ్రెస్ తో గత 7యేండ్లుగా పోరాడుతున్న ప్రజలు నాపై సింపతి చూపి ఓట్లు వేయవలసి ఉందేదన్నారు. రానున్న కాలంలో ఖచ్చితంగా మేయర్ పదవి గెలుచుకుని ఇందూరు పేరు మార్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. ఆర్మూర్ లో ఓటమిపై విశ్లేషిస్తామని. వచ్చే జిల్లా పరిషత్ ఎన్నికల్లో ఆదిపత్యం కొనసాగిస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి పటేల్ నాయకులు పాల్గొన్నారు.

మ్యాజిక్ ఫిగర్ దాటిన కాంగ్రెస్

- మేయర్ అభ్యర్థి కొలిక్కి వచ్చెనా
- మేయర్ రేసులో పంచరెడ్డి లలితా ఉమారాణి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 14 : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవిపై ఉత్కంఠత వీడింది. కాంగ్రెస్ పార్టీకి ఎంఐఎం మద్దతు ఇచ్చే విషయంలో సానుకూల సంకేతాలు రావటంతో కాంగ్రెస్ పార్టీ మ్యాజిక్ ఫిగర్ దాటింది. దాంతో మేయర్ అభ్యర్థిగా బరిలో దించేందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తీవ్ర కసరత్తు చేస్తోంది. నగరంలో ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థిగా శమంతరెడ్డిని ప్రకటించింది. కానీ, శమంత అనూహ్యంగా ఓడిపోవటంతో పార్టీ అధిష్టానం పునరాలోచనలో పడింది. ఎన్నికల్లో కాంగ్రెస్ కు 17, ఎంఐఎంకు 14 స్థానాలు మొత్తం 31 స్థానాలు మ్యాజిక్ ఫిగర్ కు చేరుకుంది. మేయర్ అభ్యర్థిగా బరిలో నిలిచిన అభ్యర్థి ఓడిపోవటంతో గెలిచిన మహిళలో జనరల్ మహిళా ఎవరూ లేక పోవటంతో జనరల్ మహిళా మేయర్ అయ్యే అవకాశం కోల్పోయింది. దాంతో మేయర్ గా బీసీ వర్గానికి చెందిన వారికే దక్కే అవకాశం మెండుగా కనిపిస్తోంది. ఇందులో భాగంగా ఇద్దరు కార్పొరేటర్ల పేర్లు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. ఇందులో 21వ డివిజన్ నుంచి గెలుపొందిన పంచరెడ్డి లలిత, 49వ డివిజన్ నుంచి గెలుపొందిన ఉమారాణిల పేర్లను అధిష్టానం పరిశీలిస్తున్నారు. పంచరెడ్డి లలిత భర్త పంచరెడ్డి చరణ్ గతంలో కాంగ్రెస్ పార్టీలో అనేక సంవత్సరాలుగా కొనసాగారు. ఎన్ఎస్ఈయూఐ, యూత్ కాంగ్రెస్ పదవీలో పని చేశారు. 2020లో కార్పొరేషన్ ఎన్నికల్లో చరణ్ కాంగ్రెస్ పార్టీ నుంచి టిక్కెట్టు రాకపోవటంతో బీఆర్ఎస్ లో చేరి కార్పొరేటర్ గా పోటి చేసి ఓడిపోయారు. అప్పటి నుంచి ఎటువంటి పదవులు లేకుండా ఖాళీగా ఉన్న చరణ్ మళ్లీ కాంగ్రెస్ లో చేరారు. 21వ డివిజన్ మహిళ రిజర్వుడు కావటంతో తన భార్య లలితను బరిలో నిలిపి విజయం సాధించారు. లలిత, ఉమారాణిలలో ఒకరిని మేయర్ చేసేందుకు పీసీసీ అధ్యక్షుడు మహేష్కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి తో సమాలోచనలు చేస్తున్నారు. గత 10 యేండ్లుగా మున్నూరు కాపులకు ఎటువంటి అవకాశం ఇవ్వటంలేదని ఆ వర్గానికి చెందిన వారు అసంతృప్తితో ఉన్నారు. ఇప్పుడు అవకాశం వచ్చింది కాబట్టి మేయర్ పదవి ఇవ్వాలని పట్టు పడుతున్నారు. పైగా నగరంలో మున్నూరు కాపులకు అవకాశం ఇవ్వాలనే డిమాండ్ గత కొంతకాలంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మున్నూరు కాపుల డిమాండ్ ను పరిగణలోకి తీసుకొని వారికి న్యాయం చేకూర్చుతోందా లేదా వేచి చూడాలి.

“



ఇండియాతో, అక్కడి ప్రజలతో బలమైన ద్వైపాక్షిక సంబంధాలను కోరుకుంటున్నాం. తాము పర్యటించే దేశాల్లో భారత్ కూడా ఒకటి. ఇండియా, పాకిస్తాన్‌మధ్య ఉద్రిక్తతలు ఉన్నాయి. కానీ మేం ఏ పక్షమూ వహించం. పరస్పర గౌరవం, జాతీయ ప్రయోజనాల ఆధారంగా మేము సంబంధాలను కొనసాగిస్తాం.

- హుమాయూన్ కబీర్, బీఎన్పీ చీఫ్ తారిఖ్ రెహ్మాన్ అడ్వైజర్



వైభవంగా ఉమా శంభులింగేశ్వర స్వామి కళ్యాణం

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 14: కుకునూరు పల్లి మండలం మేధిని పూర్ గ్రామంలో శనివారం నాడు ఉమామహేశ్వర శంభులింగేశ్వర స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ఆలయంలోని శివలింగం అత్యంత పురాతనమైన కాకతీయ కాలానికి చెందినదని, శతాబ్దాల పాటు భూగర్భంలో నిక్షిప్తమై ఉన్న ఈ శివలింగం, క్రీ.శ. 1805వ సంవత్సరంలో ఆవిర్భావం మేదినీపూర్ చరిత్రలో ఒక అద్భుత ఘట్టమని తెలిపారు. 1993 నుండి కళ్యాణోత్సవం, దీపోత్సవం, శత రుద్రోత్సవం వంటి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహింస్తామన్నారు. ఈ క్షేత్రానికి మేదినీపూర్ గ్రామానికే కాకుండా చుట్టుపక్కల గ్రామాల, ప్రజలు కూడా ఒక పవిత్ర పుణ్యక్షేత్రంగా భావిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు దత్తు శర్మ, సర్పంచ్ భూర్గు మదు మోహన్, ఉప సర్పంచ్ చింతల నాగరాజు తోపాటు విరుపాక రమేష్ రెడ్డి, విరుపాక శ్రీనివాస్ రెడ్డి, విరుపాక ప్రభాకర్ రెడ్డి, సాగర్, వెంకట్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



బాకీ కార్డులు కాదు.. మీరు ఇచ్చిన హామీలు ఏవి

- 20వ వార్డు కౌన్సిలర్ రియాజ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 14: రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనపై బాకీ కార్డుల పేరుతో ప్రశ్నిస్తున్న బి ఆర్ ఎస్ నాయకులు, 10 సంవత్సరాల పాలనలో మీరు ఇచ్చిన హామీలు ఎన్ని నెరవేర్చారు అని, కాంగ్రెస్ ను ప్రశ్నించే నైతిక హక్కు మీకు లేదని 20వ వార్డు కౌన్సిలర్ రియాజ్ విమర్శించారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలిచారని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఇలాకలో ఏడు వార్డు మెంబర్లను కాంగ్రెస్ గెలుచుకుందని అన్నారు. సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ సంగారెడ్డిలో ప్రచారం చేశారని, అక్కడ ఏలాంటి ఫలితాలు వచ్చాయో కనబడుతున్నాయని అన్నారు. 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో దళితులను సీఎం ఎందుకు చేయలేదని, రేషన్ కార్డులు ఎందుకు ఇవ్వలేదని, దళిత, బీసీ, మైనార్టీ బందులను వారి అనుచరులకు ఎందుకు ఇచ్చారని, నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పేదలకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. వచ్చే మున్సిపల్ ఎన్నికలలో సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని, చైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంటుందని అన్నారు. త్వరలోనే మున్సిపాలిటీలో జరిగిన అవినీతిని బయటపెడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సలీం, అమీర్, సోహెల్ పాల్గొన్నారు.



జాతీయ యోగ న్యాయ నిర్ణేతలకు శిక్షణ

- తోట సతీష్ కు రాందేవ్ బాబా అభినందన

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 14: వరల్డ్ యోగాసన అధ్యక్షులు , ప్రముఖ యోగా గురువు రాందేవ్ బాబా సిద్దిపేటకు చెందిన యోగ శిక్షకులు తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ తోట సతీష్ ను అభినందించారు. ఉత్తర భారత దేశంలోని కురుక్షేత్ర లోని గీతా గ్యాన్ సంస్థాన్ లో జాతీయ యోగా న్యాయమూర్తులు శిక్షణ శిబిరం జరిగింది. వివిధ రాష్ట్రాల నుంచి 160 మంది యోగా జడ్జిలు శిబిరంలో పాల్గొన్నారు. ఈ విశిష్ట శిక్షణ శిబిరానికి తోట సతీష్ రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించారు. అంతర్జాతీయ స్థాయిలో యోగా విస్తృతం అవుతున్న క్రమంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి యోగ శిక్షణను, పోటీలను నిర్వహించడానికి సులభతరమైన నైపుణ్యాలను ఈ సందర్భంగా సతీష్ దేశం నలుమూలల నుంచి వచ్చిన న్యాయమూర్తులకు అందించారు . యోగా పోటీల నిర్వహణలో పాటించవలసిన నియమ నిబంధనలను వివరించారు.ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక ఉత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామ్ దేవ్ బాబా సతీష్ కు ప్రత్యేక ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా బాబా మాట్లాడుతూ భారతీయ యోగాను ప్రపంచంలోని ప్రజలందరికీ పంచి, ఆరోగ్య ప్రపంచాన్ని సృష్టించడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ యోగాసన సెక్రటరీ జనరల్ డాక్టర్ జయదీప్ ఆర్య, యోగాసన భారత్ ప్రతినిధులు రామ్ చావుల రచిత్ కౌశిక్, రోహిత్ కౌశిక్, శ్రేయస్ తదితరులు పాల్గొన్నారు. రెండు దశాబ్దాల నుంచి యోగ విజ్ఞానాన్ని ప్రజలకు చేరువ చేస్తున్న తోట సతీష్ ను ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీధర్ రావు, కృపాకర్, సిద్ది పేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తోట అశోక్ ,నిమ్మ శ్రీనివాస్ రెడ్డి తదితరులు అభినందించారు.



గెలుపు పత్రాలు అందుకున్న అభ్యర్థులు

- మున్సిపాలిటీ వద్ద భారీ బందోబస్తు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్ ఫిబ్రవరి 14 : మున్సిపల్ ఎన్నికలు ఫలితాలు వెలువడిన వెంటనే క్యాంపు లోకి వెళ్లిన వివిధ పార్టీల అభ్యర్థులు శనివారం కాంగ్రెస్ బీఆర్ఎస్ లో గెలుపొందిన కౌన్సిల్ అభ్యర్థులు పత్రాల స్వీకరణకు మెదక్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. శుక్రవారం జరిగిన ఓట్ల లెక్కింపులో బీ అర్ ఎస్ అభ్యర్థులు 15 మంది గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థులు 13 మంది గెలుపొందారు ఒక్కరు ఏకగ్రీవం కాగా మొత్తం 14 మంది వెంటనే క్యాంపుకు తరలి వెళ్లారు బి ఆర్ ఎస్ ఐదవ వార్డు సభ్యుడు మామిడ్ల అనజనేయులు ముందుగానే గెలుపు పత్రం తీసుకోగా మిగిలిన 14 మంది సభ్యులు పోలింగ్ రోజే క్యాంప్ కు తరలి వెళ్లారు. కౌంటింగ్ రోజు కూడా క్యాంప్ లోనే ఉన్నారు. శనివారం ఉదయం 14 మంది సభ్యులు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో మెదక్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. గెలుపొందిన 14 మంది సభ్యులకు రిటర్నింగ్ అధికారుల చేతుల మీదుగా గెలుపు పత్రాలు అందుకున్నారు. తిరిగి మళ్ళీ సభ్యులంతా క్యాంప్ కు తరలి వెళ్లారు. కాంగ్రెస్ అభ్యర్థుల సాధ్యం స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపు పత్రాలను తీసుకొని క్యాంపుకు వెళ్లారు మెదక్ మున్సిపల్ కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

నేటి నుండే మహాశివరాత్రి ఏడుపాయల జాతర

- సుమారు పది లక్షల మంది భక్తులు రాక
- భక్తుల కనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి
- భారీ బందోబస్తు సీసీ కెమెరాల మధ్య జాతర



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 14: తెలంగాణలోనే అతి పెద్ద పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గ మాత ఆలయం ప్రతి మహాశివరాత్రి ని పురస్కరించుకొని మూడు రోజుల పాటు ఘనంగా జాతర నిర్వహిస్తారు ఈ జాతరకు కర్ణాటక మహారాష్ట్ర ఆంధ్రప్రదేశ్ తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుండి అతిపెద్ద సంఖ్యలో భక్తులు రావడం జరుగుతుంది . అతి పురాతనమైన వనదుర్గ మాత క్షేత్రం మెదక్ జిల్లాలో నాగ్సన్ పల్లి గ్రామ శివారులో నెలకొని ఉంది తడి ఆరని నేల నిత్యం మంజీరా జలాలతో పంట పొలాలతో ఉండే మెతుకు సీమకు వన్నెతెచ్చిన జాతర ఏడుపాయల దట్టమైన అడవి ప్రాంతంలో కొండ గృహలో స్వయంభుగా వెలసిన మాత మంజీర నది ఏడుపాయలుగా చీలి తిరిగి ఒక్కటై పారుతున్న నేల ఇది స్వయంగా అమ్మవారి కొలువై భక్తుల కొంగు బంగారం భక్తుల కోరికలను నెరవేర్చే కొంగుబంగారంగా వెలసిన నేల ప్రతి మహాశివరాత్రి పురస్కరించుకొని మూడో రోజుల పాటు కన్నుల విందుగా జరిగే జాతర ఏడుపాయల వనదుర్గమాత జాతర జాతర మొదటి రోజు ఉపవాస దీక్షలు రెండవ రోజు బండ్లు తిరుగుట మూడవరోజు రథోత్సవ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు రావడం జరుగుతుంది. ఈ మహాశివరాత్రి జాతరను పురస్కరించుకొని జిల్లా అధికారులు ఇప్పటికే జాతర ఏర్పాట్లకు జిల్లా అధికారులతో ఆలయ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీటి సాగునీటి మరుగుదొడ్ల తాత్కాలిక నిర్మాణం తో పాటు భక్తులు ఉండేందుకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగింది మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ధర్మదాయ దేవాదాయ శాఖ అధికారులు పలుమార్లు సమావేశాలు నిర్వహించి జాతరకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు . మహా జాతరను పురస్కరించుకొని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఈ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించి నిధులు ఇవ్వడం జరిగింది దసరా నవరాత్రి ఉత్సవాలు ఏడుపాయల వన దుర్గ మాత ఆలయంలో ఘనంగా నిర్వహిస్తారు నవరాత్రి ఉత్సవాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. గత సంవత్సరం ముఖ్యమంత్రి ఎనమల రేవంత్ రెడ్డి అమ్మవారి దర్శనానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఏడుపాయల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరడంతో. ఏడుపాయల వన దుర్గ మాత ఆలయ అభివృద్ధి కోసం సుమారు 40 కోట్ల రూపాయలు విడుదల చేశారు దీంతో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఏడుపాయల వన దుర్గ మాత ఆలయంలో ప్రతినిత్యం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు అభిషేకం. ఒడిబియ్యం.కేశఖండనం. ప్రత్యేక దర్శనం.ప్రత్యేక పూజ. పల్లకి సేవ.మొక్కుబడి.కుంకుమార్చన. వీఐపీల కుంకుమార్చన.నాతోపాటు భక్తులు ఎవరైనా వాహన పూజ కార్యక్రమాలు నిర్వహించుకుంటే సైతం భారీ వాహనాలు ఫ్లోర్ విల్లర్ ద్విచక్ర వాహనాలు ద్విచక్ర వాహనాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. మూడు రోజులపాటు జరిగే మహా జాతర కు పారిశుద్ధ కార్మికులను సుమారు 600 మంది నియమించడం జరిగిందని జిల్లా పంచాయతీ రాజ్ అధికారి యాదయ్య తెలిపారు జాతరలో 600 మంది పంచాయితీ పారిశుద్ధ కార్మికులతో పాటు 250 మంది పంచాయతీ కార్యదర్శులను వీరిని కోఆర్డినేట్ చేయడానికి 18 మంది మండల పంచాయతీ కార్యదర్శులను నియమించడం జరిగిందని వీరికి ఇప్పటికే సబ్బులు చీపురు కట్టలు కట్టలు, చేతులకు బ్లౌజెస్ ఇతర సామాగ్రిని తేవడం జరిగిందని మహా జాతర పురస్కరించుకొని జాతరలో ఎలాంటి పారిశుద్ధం లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.


జాతర ఏర్పాట్లను పరిశీలించిన మెదక్ జిల్లా కలెక్టర్

మహాశివరాత్రి జాతరను పురస్కరించుకొని భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని, ఏడుపాయల జాతర పెండింగ్ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. ఏడుపాయల జాతర ఏర్పాట్లను పరిశీలించారు. మహా జాతర పురస్కరించుకొని ప్రభుత్వం తరఫున స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆలయ అధికారులు తెలిపారు.

పరమశివుని అనుగ్రహంతో అన్నింటా శుభం జరగాలి

- మహా శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 14: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రజలందరికి మాజీ మంత్రి , ఎమ్మెల్యే హరీష్ రావు మహా శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పర్వదినాన్ని ప్రజలంతా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆ పరమేశ్వరుని అనుగ్రహముతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అన్నింటా శుభం చేకూరాలన్నారు. మహా శివరాత్రి రోజున స్వామి వారి ఉపవాస దీక్ష లో ప్రజలందరూ భక్తితో స్వామిని కొలిచి మీ కోర్కెలు నెరవేరాలి అని ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాని కోరుకున్నారు.





రాంపూర్ శివాలయం వద్ద జాతర ఉత్సవాలు

- వేలాది భక్తులకు అన్నదానం

ప్రత్యక్షం, చేగుంట, ఫిబ్రవరి 14: మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా చేగుంట మండలం రాంపూర్ శివాలయం వద్ద జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వేల సంవత్సరాల క్రితం రాంపూర్ అడవి సమీపంలో అగ్రహారం శివాలయం వెలిసింది. ఆలయానికి సంబంధించిన రెండు ఎకరాలు విస్తీర్ణంలో వనం ఏర్పాటు చేశారు. వేలాదిగా తరలివచ్చే భక్తులకు వృక్షాలు నీడనిస్తున్నాయి. ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులు గుండంలో స్నానాలు చేయుటకు ఏర్పాట్లు చేశారు. పరిసరాల్లో మిఠాయి దుకాణాలు ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం గండ దీపాల ఊరేగింపు కొనసాగుతుంది. సోమవారం మధ్యాహ్నం వేలాది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. రాత్రి కళాకారుల ప్రదర్శన కొనసాగుతుంది.



మహాశివరాత్రి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 14: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ తెలిపారు. శనివారం జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం, నారాయణరావుపేట మండలంలోని బుగ్గ రామేశ్వరాలయం, సిద్దిపేట పట్టణంలోని కోటిలింగాల ఆలయాన్ని సందర్శించి, భద్రతా ఏర్పాట్లను స్వయంగా సమీక్షించారు.కొమురవెల్లి మల్లన్న దర్శనానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఆలయ పరిసరాల్లో పార్కింగ్, క్యూ లైన్లు, అదనపు బలగాల మోహరింపుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.అన్ని ప్రధాన ఆలయాల వద్ద సిసిటివి కెమెరాల నిఘాను పెంచాలని, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచాలని సూచించారు. వాహనాల రద్దీ వల్ల భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ ప్లాన్ అమలు చేయాలని ఆదేశించారు. పోలీస్ శాఖ, రెవెన్యూ,ఆలయ కమిటీలు సమన్వయంతో పనిచేసి శివరాత్రి వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా సిపి రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలకు మహాశివరాత్రి సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా కొమురవెల్లి, బుగ్గ రామేశ్వరాలయం, కోటిలింగాల ఆలయం వంటి ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం అని తెలిపారు.

కేసీఆర్ పాలన అద్భుతం

- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 14: కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చిందని, ప్రజలు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అనేక అద్భుతాలను చూసిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఒక చారిత్రాత్మక ఘట్టమని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అనేక ప్రాజెక్టులను నిర్మించారని తెలిపారు. గతంలో నీరు, విద్యుత్ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని, కేసీఆర్ హయాంలో రైతులకు గిట్టుబాటు ధరతో పాటు పంట సహాయం అందిందన్నారు. తాను టీడీపీ లో ఉన్న సమయంలో ఐదు గంటలకు మించి విద్యుత్ అందుబాటులో ఉండేదే కాదని గుర్తుచేశారు. అందరి పోరాట ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అద్భుతంగా తీర్చిదిద్దారని అన్నారు. సిద్దిపేట అభివృద్ధిలో మంత్రి హరీష్ పాత్ర విశేషమని ప్రశంసించారు. రియల్ ఎస్టేట్ రంగం కాంగ్రెస్ ప్రభుత్వంలో దెబ్బతిన్నదని, కేసీఆర్ పాలనలో భూముల ధరలు పెరిగాయని, ప్రస్తుతం అవి పడిపోయాయని విమర్శించారు. రైతుబంధు పథకాన్ని ఐక్యరాజ్య సమితి అభినందించిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని పాలన సాగిస్తోందని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావం ఉన్నప్పటికీ తమ కార్యకర్తలు ధైర్యంగా పోరాడి విజయం సాధించారని పేర్కొన్నారు.రాజకీయ వ్యవస్థలో ప్రభుత్వాలు శాశ్వతం కావని, ప్రజలే శాశ్వతమని వ్యాఖ్యానించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఒక్క పెద్ద ప్రాజెక్ట్ కూడా నిర్మించలేదని ఆరోపించారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం పేరుతో పురుషులపై భారాన్ని పెంచారని విమర్శించారు. ఈ మీడియా సమావేశంలో మాజీ మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి, పోచబోయిన శ్రీహరి , అర్షద్, నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





లోకల్ ఎన్నికల్లో కూడా డబ్బు ప్రభావం బాగా పెరిగింది. కాంగ్రెస్ విచ్చలవిడిగా ఖర్చు చేసింది. ఆశించిన సీట్లు రాలేదని కాంగ్రెస్ లో అసంతృప్తి ఉంది. బీజేపీకి ఓట్లు, వార్డులు తక్కువ వచ్చినా అంతా బాగున్నట్లు చెప్పడం ఎందుకో అర్థం కావడం లేదు. మా పార్టీ గట్టిగా పోరాడింది. ఇప్పుడున్న 17 మున్సిపాల్టీలతో పాటు హంగ్ స్థానాల్లోనూ ఎక్కువ గెలుచుకుంటాం.
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


కాంగ్రెస్‌తో ఎల్లప్పుడూ దేశ భద్రతకు ప్రమాదమే

- తీవ్రంగా మండిపడ్డ ప్రధాని మోడీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ,ఫిబ్రవరి 13: కాంగ్రెస్ ఎల్లప్పుడూ దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. దేశాన్ని ముక్కలు చేయాలని కలలు కనేవారిని, ఈశాన్య ప్రాంతాన్ని భారత్ నుంచి వేరు చేయాలని నినాదాలు చేసేవారిని హస్తం పార్టీ సమర్థిస్తుందని విమర్శించారు. దేశాన్ని విభజించాలనుకునేవారే కాంగ్రెస్ ఆరాధకులుగా మారుతారని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ముస్లిం లీగ్ దేశాన్ని విభజించిందని, ఇప్పుడు నేటి కాంగ్రెస్ 'ముస్లిం లీగ్ మావోయిస్టు కాంగ్రెస్'గా మారిందని దుయ్యబట్టారు. అందుకే కాంగ్రెస్ పట్ల అసోం ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అసోంలోని గువాహటిలో జరిగిన ర్యాలీలో ఈ మేరకు మోదీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అసోం ఆకలితో అలమటించిందని ప్రధాని మోదీ ఆరోపించారు. అలాగే భయం గుప్పిట్లో ఉందన్నారు. అభివృద్ధి కోసం నిధులు ఇవ్వకుండా తప్పించుకునే హస్తం పార్టీ అసోంను అభివృద్ధి చేయగలదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో కేంద్రం నుంచి అసోం పన్ను వాటాగా రూ.10,000 కోట్లు మాత్రమే అందుకునేదన్నారు. ఇప్పుడు బీజేపీ సర్కార్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కన్నా 5 రెట్లు ఎక్కువను పన్ను వాటాగా అందుకుంటోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విస్మరించిన ఈశాన్య ప్రాంతాలకు తాము భక్తితో సేవ చేస్తున్నామని పేర్కొన్నారు.

స్కాములన్నీ కాంగ్రెస్ హయాంలోనే

కాంగ్రెస్ హయాంలో 3జీ, 4జీ టెక్నాలజీ వచ్చిందని, అలాగే 2G స్కామ్ కూడా వచ్చిందని మోదీ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ దశాబ్దాల పాలనలో ఎయిమ్స్‌ల గురించి పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో అసోంలో హింస, వేర్పాటువాదం ఉండేదన్నారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలో ఎన్‌డీఏ సర్కార్ శాంతి, శ్రేయస్సు, వేగవంతమైన అభివృద్ధి అనే సంకల్పంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.



విశ్వ వీక్షణం



ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ ప్రారంభించిన ప్రధాని


ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: అసోంలో ఏర్పాటు చేసిన తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటిలీ ను శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. దిబ్రూగడ్‌లోని మొరాన్ బైపాస్ వద్ద తీర్చిదిద్దిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీపై సీ130జే విమానంలో మోదీ ల్యాండయ్యారు. తొలుత చబువా ఎయిర్‌ఫీల్డ్‌కు చేరుకున్న ప్రధాని మోదీ అక్కడ సీ 130 జే విమానం ఎక్కి మొరాన్ బైపాస్ ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిలో దిగారు. అదే ఈఎల్ఎఫ్‌పై ఆధునిక యుద్ధ విమానాలైన రఫేల్, సుఖోయ్30, హెలికాప్టర్ల విన్యాసాలను ఆయన తిలకించారు. దాదాపు 40 నిమిషాలు పాటు ఈ విన్యాసాలు జరిగాయి. అంతకుముందే ఈ ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ గురించి ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. క్లిష్ట సమయంలో సహాయ కార్యకలాపాలకు, అత్యవసర ప్రతిస్పందనకు ఈ ఈఎల్ఎఫ్ కీలకమని పేర్కొన్నారు. చైనా సరిహద్దులకు సమీపంలో దేశ రక్షణకు ఈ ఈఎల్ఎఫ్ కీలకం కానుంది. 4.2 కిలోమీటర్ల పొడవైన ఈ హైవే కోసం దాదాపు 100 కోట్లు ఖర్చు చేశారు. అత్యవసర సమయాల్లో సైనిక, పౌర విమానాల ల్యాండింగ్, టేకాఫ్ కోసం భారత వైమానిక దళం(ఐఏఎఫ్) సమన్వయంతో ఈ ఈఎల్ఎఫ్‌ను ప్రత్యేకంగా అభివృద్ధి చేశారు. దీని వల్ల సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు జరిగినప్పుడు భారత వాయుసేన వేగంగా స్పందించేందుకు అవకాశం ఉంటుంది. 40 టన్నుల వరకు యుద్ధ విమానాలను, 74 టన్నుల గరిష్ఠ టేకాఫ్ బరువు గల రవాణా విమానాలను నిర్వహించగలదు. టేకాఫ్, ల్యాండింగ్‌కు అనుకూలంగా దీనిని రూపొందించారు. ఇప్పటికే పశ్చిమ, ఉత్తర, మధ్య భారత్‌లో ఈ ఈఎల్ఎఫ్‌లు ఉన్నాయి.



రాచకొండ గుట్టల్లో జరిగే

ఉర్సు, ఉత్సవాలను వెళ్లి చూసొద్దామా..!

రాచకొండ అంటేనే గుట్టలు... గుహలు... గోపురాలు, అబ్బురపరిచే శిల్పాలతో పాటు కోనసీమ అందాలను మైమరిపించే విధంగా రాచకొండ గుట్టలు దర్శనమిస్తాయి. రాతి కట్టడాలు, కోట గోడలు,గోల్కొండను మైమరిపించే విధంగా అద్భుతంగా ఉంటాయి.ఉమ్మడి నల్లగొండ జిల్లా రంగారెడ్డి జిల్లాల సరిహద్దు ప్రాంతమైన రాచకొండ ప్రాంతాన్ని1361లో రేచర్ల పద్మనాయకులు రాజధానిగా చేసుకుని పరిపాలన కొనసాగించారు. తెలంగాణలో కాకతీయ రాజుల తర్వాత చెప్పుకోదగ్గ రాజులు రాచకొండ వెలమ ప్రభువులు. వీరినే రేచర్ల పద్మనాయకులు అని పిలిచేవారు. చరిత్రకు తెలిసినంత వరకు వీరు తమ మూల పురుషుడు చెవిరెడ్డి(బేతాళ నాయకుడు) మొదలుకొని క్రీ.శ 1553 మంచి కాకతీయులకు సామంతులుగా నల్లగొండ జిల్లాలోని ఆమనగల్లు. పిల్లలమర్రి ప్రాంతాలను పాలించారు కాకతీయులు క్రీ.శ 1323 లో పథకం అయ్యాక ఓరుగల్లు రాజ్యాన్ని పాలించిన ముసునూరు నాయకులకు సానుకూలంగా ఉన్నారు. కానీ సింగమ నాయుడు క్రీ.శ 1957 తర్వాత అనతి కాలంలోనే సింగమనాయకుడు జల్లిపల్లి యుద్ధంలో మరణించారు. సింగమ కొడుకు అన్న పోతమ నాయుడు క్రీ.శ1361 రాజధాని అమనగల్లు నుంచి "రాచకొండ" కు మార్చాడు. తన తమ్ముడు మాదా నాయకుడిని దేవరకొండలో నియమించారు. వీరి పాలన తెలంగాణ జిల్లాల్లో రాచకొండను రాజధానిగా చేసుకుని దశాబ్దానికి పైగా పాలన కొనసాగింది.రాచకొండ రాజులు పడమర ఉన్న బహమనీ సుల్తాన్‌లతో స్నేహం చేసి కోస్తా ఆంధ్రులను రెడ్డి రాజుల ను అణచివేశారు. అనంతరం కళింగ (ఒరిస్సా) గణపతి రాజులతో స్నేహం చేసి బహుమానం సుల్తాన్ లను ఓడించారు. చివరికి విజయనగరం (కర్ణాటకఆంధ్ర) రాజుల తో స్నేహం చేస్తున్న సమయంలో బహమనీల చేతిలో రాజ్యాన్నిపోగొట్టుకున్నారు. తిరిగి వారి నుంచి క్రీస్తు శకం 1536 లో గోల్కొండ పాలకుడు కులీ కుతుబ్ షా రాచకొండను వశపరచుకున్నారు. క్రీ.శ 143360 మధ్య, క్రీ.శ 1475 1503 మధ్యకాలంలో రాచకొండ బహమనీ సుల్తానుల స్థానిక పాలన కేంద్రంగా ఉంది రాచకొండ గుట్టలు వేలాది ఎకరాల్లో విస్తరించి ఉన్నప్పుడు ప్రధానంగా సంకెళ్లబాయి గుట్ట నుంచి వెళ్లి పాలన కార్యక్రమాలు కొనసాగాయి. సంకెళ్ల బావి గుట్టను పరిశీలిస్తే సుమారు 600 అడుగుల ఎత్తు లో గల ఈ గుట్ట చుట్టూ పెద్ద పెద్ద బండరాళ్ళతో నిర్మించిన కోట కూడా ఉంది.పడమర వైపు పెద్ద ద్వారం దాటాక రామాలయం ఉంది. గుడికి దక్షిణ భాగాన కోనేరు, కోటవైపు వెళ్తున్నప్పుడు మరో దిక్పూటాలయం. గుట్టపైన రెండు బండరాళ్ల మధ్య లో ఉండే బావిలో ఎల్లప్పుడూ నీరు ఉండటం విశేషం. దీనికి వంద మీటర్ల దూరంలో ఉత్తరాన బహుమనీ ముస్లింలు (మాలిక్ నిమత్) ఆలయం శిలలో క్రీ.శ.1484 లో నిర్మించిన మసీదు ఉంది. కోట మధ్యలో అగ్రస్థానాన రాజమందిరం దానికి కుడి వైపు మూలలో ఒక ఆలయం శిథిలమై ఉంది. గుట్ట పరిసర ప్రాంతాల్లో ఎటుచూసినా కోటలు కనిపిస్తాయి. గుట్టకు ఉత్తరాన కిలో మీటర్ దూరంలో హజ్రత్ గాలీబ్ షహీద్ దర్గా ('గాడిపీర్ల దర్గా')దర్శనమిస్తుంది.ఈ దర్గావద్ద నేటికీ ప్రతి శివరాత్రికి హిందూ,ముస్లింల మత సామరస్యానికి ప్రతీకగా వారం రోజుల పాటు ప్రస్తుతం ఉర్సు ఉత్సవాలు ప్రారంభమైనవి ఈ నెల 13 శుక్రవారం ప్రారంభమై వారం రోజుల పాటు అంగరంగ వైభవంగా ఘనంగా జరుగుతాయి.సుమారు



సమీపంలోని ఆరు జిల్లాల నుంచి భక్తులు పాల్గొని ఘనంగా ఉర్సు ఉత్సవాలు జరుపుకుంటారు. వెళ్లాల్సిన వారు రాచకొండ ప్రాంతానికి వెళితే ఒక మంచి ప్రదేశాన్ని చూశామనే తృప్తిని పొందుతారు అనేదిమాత్రం చెప్పవచ్చు. నరసింహులు గుట్టపైన ఒక పెద్ద గృహాలయం ఉంది. మరో నరసింహ ఆలయం నిర్మించారు. దాని ముందు బండరాళ్ల కు ద్వాదశ ఆశార్ల మూర్తులను కేంద్రాలుగా ఉన్నాయి. రాచకొండ లో అపారమైన కళా సంపద, నాటి పాలకుల రాజ ప్రసాదాలు, రంగురాళ్ల క్వారీలు, కొండలు, లోయలు, అందమైన ప్రకృతి అటవీ సంపద. రాచకొండ లో నిత్యం సందర్శకులు వచ్చే ఇటీవల గుప్త నిధుల తవ్వకాల మూలంగా బయటపడిన 14 అడుగుల ఎత్తయిన శివలింగం ఉంది.నిత్యం వేలాది మంది ప్రజలు దర్శనానికి విచ్చేస్తారు మహాశివరాత్రి పర్వదినంగా తండోపతండాలుగా జనం వస్తారు. అప్పటి ప్రభుత్వం ఈ ప్రాంతానికి రాచకొండ ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందించేందుకు కృషి చేసింది సంకల్పించింది.దానికి సంబంధించిన పనులు డిపిఆర్ సిద్ధం కొరకు సర్వే కొరకు ప్రభుత్వం కొంత నిధులు కూడా వెచ్చించింది పనులు కుడా ప్రారంభమైనవి. చూడాలి మరి ఇప్పుడేమో ప్రభుత్వం మారింది కాంగ్రెస్ సర్కార్ వచ్చింది..రాచకొండ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తుందా, ఈ ప్రాంతానికి సకాలంలో నీళ్లు ఇస్తుందా అనేది వేచి చూడాల్సిందే.ఈ రాచకొండ ప్రాంత అభివృద్ధికి వివిధ గ్రామాల్లోని యువకులు,నాయకులు స్వచ్ఛందంగా కమిటీని ఏర్పాటు చేసుకొని 'రాచప్ప' కమిటీ పేరా ప్రతి సోమవారం శివాలయం వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పర్యాటకులకు రాచకొండ అందాలను, చరిత్రను వివరిస్తున్నారు. గత బిఆర్ ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ చొరవతో తెలంగాణ టూరిజం శాఖ సహకారంతో రాచప్ప కమిటీ ఆధ్వర్యంలో గత ఎనిమిదేళ్ల క్రితం రాచకొండ పర్యటక ఉత్సవాలు ప్రారంభించారు నాటి నుండి ప్రతి ఏడాది కొనసాగిస్తూ వస్తున్నారు ఉత్సవాలు.అలనాటి రాజులైన రేచర్ల పద్మనాయక వంశీయులు రాచకొండ ను రాజధానిగా చేసుకుని పరిపాలించిన క్రమంలో వారు నిర్మించిన అనేక గుళ్ళు, గోపురాలు,శత్రుదుర్భేద్య కట్టడాలు నిర్మించిన తటాకాలు చెక్కిన శిల్ప కళాసంపద, ద్వారా మండపాలు, కోనేరు, ఇత్యాది ఆనవాళ్ళతో కూడిన అద్భుత ఫోటో ప్రదర్శన, బయల్పడిన శివలింగం, రామాలయం, దర్గాలు ముఖ్యమైనది. అప్పటి పూర్వ వైభవం అవగాహన కల్పించడానికి యాత్రికులకు భక్తులకు అశేష ప్రజానీకానికి సందర్శించేందుకు వీలు కల్పించడం కోసం ఉత్సవాల ప్రధాన ఉద్దేశం.... ప్రతి యేడు రాజకొండలో జరిగే ఉర్సు ఉత్సవాలకు వెళ్తుంటాం గత సంవత్సరం రాచకొండకు మిత్రులతో కలిసి వెళ్లినం రెండు రోజుల పాటు ఆనందంగా గడిపినం ఎంత గొప్ప అనుభూతిని పొందినమంటే మాటల్లో చెప్పలేం.. ప్రతి సంవత్సరం రాచకొండలో జరిగే హజ్రత్ గాలిబ్ షహిద్ షరీఫ్ ఉర్సు ఉత్సవాలకు మహాశివరాత్రి సందర్భంగా రెండు రోజులపాటు అక్కడే ఉండి ఆనందంగా ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ చాలా గొప్పగా ఎంజాయ్ చేసినం.రాచకొండ గుట్టల్లో వారం రోజులపాటు జరిగే శివరాత్రి ,ఉర్సు, పర్యటక ఉత్సవాల కొరకు వెళ్లాలనుకునేవారు హైదరాబాద్ నుండి ఎల్బీనగర్ నుండి విజయవాడ జాతీయ రహదారిలో కొయ్యలగూడెం నుండి కుడివైపుకు మల్లీ పీపల్ పహాడ్, అల్లాపురం మీదుగా రాచకొండకు చేరుకోవచ్చు... లేదా ఇబ్రహీంపట్నం నుండి ఆరుట్ల మీదుగా రాచకొండ కు చేరుకోవచ్చు. నల్లగొండ పరిసర ప్రాంతాల నుండి విచ్చేసే వాళ్లు సంస్థాన్ నారాయణపురం నుండి వెళ్లొచ్చు మార్గమధ్యలో సరళ మైసమ్మ దేవాలయం అల్లపురంలో ఉంటుంది దర్శించుకుని రాచకొండకు చేరుకోవచ్చు. మిత్రులతో కుటుంబ సభ్యులతో కలిసి తండోపతండాలుగా తరలివస్తుంటారు జనం రాచకొండను చూడడానికి ఇక్కడ ప్రకృతి అందాలను ఆస్వాదించడానికి మహాశివరాత్రి సందర్భంగా ఇక్కడ జరిగే ఉర్సు ఉత్సవాలను, జాతరను పర్యాటక ఉత్సవాలను వీక్షించేందుకు చూసి ఆనందించేందుకు వస్తుంటారు. ఇదంతా రాచకొండ గిరి కుటుంబ సభ్యుల వ్యవసాయ భూమిలో కూర్చుంటాం ఎన్నో ఏళ్లుగా సేద్యం చేస్తూ జీవిస్తున్నారు ఇంటి పేరే రాచకొండ గా ఉన్నప్పటికీ తమ భూములపై తమకు పూర్తిస్థాయి హక్కులు లేవు నేటికీ పాసుబుక్కులు లేవు, అటవీ శాఖ అధికారుల నుండి ఇబ్బందులు, ప్రభుత్వ సౌకర్యాలు రావు, పూర్తిస్థాయిలో హక్కులను కల్పించాలని మా భూములకు కొత్త పాసుబుక్కులు మంజూరు చేయాలని, ఇప్పించాలని కలవని లీడర్ లేదు, మొక్కని దేవుడు లేదు. చూడాలి మరి ఎప్పుడు పూర్తిస్థాయిలో హక్కులు కలుగుతాయో. మరొకరు అడ్వకేట్ నరేష్ కుమార్ అందరినీ సమన్వయం చేసుకుంటూ అందరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తిగా భాధ్యతగా చూసుకుంటాడు. మరొకరు డి.ఎం. (కట్ట నర్సింగరావు) ఇతనికి అడవుల్లో అందరితో కలిసి ఉండాలనేది ఇష్టం, మద్యం ముట్టడు, కల్లు మాత్రమే ఇలాంటి ఆనందపు సందర్భాల్లో ఫుల్లుగా త్రాగుతాడు, మూలన ఉన్నముసలవ్వకు కూడా అర్థమయ్యే భాషను వాడుతుంటాడు పూర్వపు శాస్త్రాలతో కడుపుబ్బా నవ్విస్తాడు. ఇలా చేస్తాడని మామూలు వ్యక్తేమో అనుకుంటే పొరపాటే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. కార్యక్రమాన్నంత తన కెమెరాలో బంధించి భవిష్యత్ లో మేం చూసుకునే విధంగా అందరి ఫోటోలను దింపేది మాత్రం మందుగల సాయికిరణ్. కట్ట భౌరేషన్న నేమో అందరూ సంతోషంగా ఉండాలని ఎంతైనా ఖర్చు పెడతాడు మంచోడు. మరొకరు జి.రమేష్ (సెంట్రింగ్ కాంట్రాక్టర్) కల్మషం లేని గుణవంతుడు ఉన్నది ఉన్నట్టు మాట్లాడుతాడు అందరికీ ఆదర్శంగా ఉంటాడు, లక్ష తో వ్యాపారాన్ని ప్రారంభించి 50 లక్షల వ్యాపార సామ్రాజ్యాన్ని సృష్టించుకున్నాడు నేటికి పదిమందికి ఉపాధి కల్పిస్తున్నాడు.. ఇగ అడవుల మీద పట్టున్న బోయిని విద్యాకర్ రాచకొండ లో ఉన్న గుట్ట గుట్టకు వాటి పేరుని వారి చరిత్రను చెప్పే ముచ్చటకు అందరు శ్రద్ధగా వింటారు. ఎందుకంటే రాచకొండలో ఏ మూలన ఏముందో ఏ జంతువు పేరు ఏదో అన్ని క్లుప్తంగా మా గుంపులో తెలిసిన వ్యక్తి ఇతనే. కట్ట యాదయ్య మామ సుక్క ముట్టడు ,ముక్క తినడు కానీ అడవులంటే ప్రాణం అందరూ ఆనందంగా రాచకొండలో గడుపుదాం అంటే అందరికన్నా ముందుంటాడు తన గొంతు నుంచి తీసే రాగానికి అడవంత నిశ్శబ్దమే అంత మంచి పాట కాదు.. చిన్న కృష్ణన్న చాలా ఓపికస్తుడు మేమెంతో ఎంజాయ్ చేస్తున్న మితిమీరితే హద్దుల్లో పెడతాడు అందర్నీ క్షేమంగా ఇంటికి చేరేలా చూస్తాడు. మరొకరు మందుగుల లక్ష్మణ్ ఈ ఏడాది రోడ్డు ప్రమాదం జరగడంతో ఈ ఉత్సవాలకు హాజరు కాలేకపోతున్నాడు.మంచి వ్యక్తిత్వం గల వ్యక్తి ఎట్టి విషయానైన మెట్నకు సరిగ్గా సరితూగేలా వ్యవహరిస్తాడు. ఏడాదికోసారి జరిగే రాచకొండ ఉర్సు ఉత్సవాలకు తప్పనిసరిగా సాధ్యమైనంతవరకు అందరం పాల్గొంటాం. చక్కటి అనుభూతిని ఆనందాన్ని పొందుతాం. ఇక మిగతా వాళ్లంతా వాళ్ల అనుభవాలను, జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ రాచకొండ గుట్టలను, కోనలను,కుంటలను కలియ తిరిగి సాయంత్రానికి దర్గా వద్దకు చేరుకొని రంగుల రత్నం, రింగులాట జాతరలో కనిపించే వాటన్నిటిని ఆస్వాదిస్తూ ఎంజాయ్ చేస్తారు.... పైన వాళ్లంతా ఒక్కొక్కరు ఒక్కో కులం,మేమంతా స్నేహితులం.

గుండమల్ల సతీష్ కుమార్
సంస్థాన్ నారాయణపురం
94931 55522.






ఒప్పందాలపై మోడీ ప్రభుత్వం భ్రమలు కల్గిస్తోంది

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: అమెరికాతో మోదీ సర్కార్ చేసుకున్న ఒప్పందం కారణంగా దేశంలో వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ఆరోపించారు. ప్రధాని, ఆయన కేబినెట్ మంత్రులు ప్రజల్లో భ్రమలు కల్పిస్తున్నారని ఆయన ఎక్స్‌లో దుయ్యబట్టారు. అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకుంటేనే, భారత వస్త్ర పరిశ్రమకు సుంకాల మినహాయింపు ఉంటుందనే విషయాన్ని ఎందుకు దాచారని ఆయన ప్రశ్నించారు. బంగ్లాదేశ్ కూడా భారత్ నుంచి పత్తి దిగుమతులను నిలిపివేసే సంకేతాలు ఇస్తోందని, తద్వారా రైతులకు నష్టం జరుగుతుందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దూరదృష్టి గల ప్రభుత్వం అయితే పత్తి రైతులు, టెక్స్‌టైల్ ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడేలా ఒప్పందం చేసుకునేదని రాహుల్ అన్నారు.

మోదీ ప్రభుత్వం పత్తి, వస్త్ర రంగాలకు నష్టం కలిగించింది!

ఒకవేళ మోదీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల కోసం ఆలోచించి ఉంటే పత్తి రైతులు, వస్త్ర ఎగుమతిదారుల శ్రేయస్సును రక్షించే విధంగా చర్చలు జరిపి ఉండేదని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ, ఆయన ప్రభుత్వం కలిసి రెండు రంగాలకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. ఈ ఒప్పందం కారణంగా పత్తి, వస్త్ర పరిశ్రమ రంగాలపై ఆధారపడి ఉన్న కోట్లాది మంది భారతీయుల కుటుంబాలను నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం అనే గొయ్యిలోకి నెట్టివేశారని రాహుల్ గాంధీ విమర్శించారు.



పుల్వామా వీరుల త్యాగం ప్రతి భారతీయుడికీ స్ఫూర్తి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: 2019లో జరిగిన పుల్వామా దాడిలో అమరులైన సీఆర్‌పీఎఫ్ జవాన్లకు ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల ధైర్యం, దేశభక్తి ప్రతి భారతీయుడికి ఇప్పటికీ స్ఫూర్తినిస్తోందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. '2019లో ఈ రోజున పుల్వామాలో ప్రాణాలు అర్పించిన వీర సైనికులను స్మరించుకుంటున్నాను. వారి సేవ, సంకల్పం, దేశభక్తి ఎప్పటికీ మనందరి జ్ఞాపకాల్లో శాశ్వతంగా నిలిచిపోతాయి. వారి అసమాన ధైర్యసాహసాల నుంచి ప్రతి భారతీయుడు స్ఫూర్తిని పొందుతాడు' అని ప్రధాని మోదీ పోస్ట్‌లో రాసుకొచ్చారు. అంతకుముందు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ కూడా నివాళులు అర్పించారు. పుల్వామా ఉగ్రదాడిలో వీరమరణం పొందిన ధీరుల త్యాగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. బలమైన, సురక్షితమైన భారతదేశాన్ని నిర్మించడానికి వారి త్యాగం మనకు నిరంతరం స్ఫూర్తినిస్తుందని చెప్పారు. పలువురు కేంద్ర మంత్రులు కూడా నివాళులర్పించారు.

నివాళులు అర్పించిన రాహుల్

కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా వీర జవాన్లకు నివాళులర్పించారు. 2019 పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన మన వీర సైనికులకు నివాళులు అర్పిస్తున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. వారి అత్యున్నత త్యాగానికి దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందని రాసుకొచ్చారు.




చిన్న స్వామి స్టేడియంలో క్రికెట్ దిగ్గజాల పేర్లతో స్టాండ్లు

చిన్నస్వామి మైదానం కొత్త కళ సంతరించుకోనుంది. క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో కర్నాటక క్రికెట్ సంఘంకీలక నిర్ణయం తీసుకుంది. భారత, కర్నాటక క్రికెట్‌కు విశేష సేవలందించిన దిగ్గజాలను గౌరవిస్తూ వారి పేర్లను చిన్నస్వామి స్టాండ్లకు పెట్టనుంది. మాజీ కెప్టెన్లు శాంత రంగస్వామి, అనిల్ కుంబ్లే, రాహుల్ ద్రవిడ్ పేరుతో స్టాండ్లను ఏర్పాటు చేస్తామని శనివారం కేఎస్‌సీఏ తెలిపింది. కర్నాటక క్రికెట్ సంఘం భారత లెజెండ్స్‌కు ప్రత్యేక గౌరవం కల్పించనుంది. మ్యాచ్‌ల పునరుద్ధరుణనకు ఆమోదం లభించడంతో మాజీ కెప్టెన్లు రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే, మహిళల జట్టు మాజీ సారథి రంగస్వామిల పేర్లతో పెవిలియన్స్ ఏర్పాటు చేయనుంది. భారతదేశం గర్వించదగ్గ స్పిన్నర్ కుంబ్లే.. టెస్టుల్లో 619, వన్డేల్లో 337 వికెట్లు పడగొట్టాడు. ఇక ద్రవిడ్.. టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన రెండో భారతీయుడిగా నిలిచాడు. సచిన్ 13,288తో అగ్రస్థానంలో ఉండగా.. ద్రవిడ్ 10,889 రన్స్ చేశాడు. రంగస్వామి విషయానికొస్తే.. భారత మహిళల జట్టుకు మొట్టమొదటి కెప్టెన్ తను. ఆమె హయాంలోనే టీమిండియా తొలి టెస్టు సిరీస్ గెలిచింది. అంతేకాదు.. మహిళల క్రికెట్‌లో తొలి టెస్టు సెంచరీ కొట్టింది ఆమెనే. భారత క్రికెట్‌పై చెరగని ముద్ర వేసినందున ఈ ముగ్గురి పేర్లతో చిన్నస్వామి స్టేడియంలో స్టాండ్లు పెట్టాలని కర్నాటక క్రికెట్ సంఘం తీర్మానించింది. ఆర్సీబీ జట్టు నిరుడు ఐపీఎల్ (18వ సీజన్) విజేతగా నిలవడంతో అభిమానులు పులకించిపోయారు. విక్టరీ పరేడ్‌లో తమ అభిమాన ఆటగాళ్లను చూసేందుకు జూన్ 4వ తేదీన చిన్నస్వామి స్టేడియానికి భారీగా తరలి వచ్చారు. అయితే.. ఫ్యాన్స్ పోటెత్తడంతో అందర్నీ అదుపు చేయలేకపోయారు పోలీసులు. ఒక్కసారిగా స్టేడియం గేటు తెరవడంతో లోపలికి వెళ్లేందుకు అభిమానులు పరుగులు తీశారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరిగి 11 మంది ప్రాణాలు విడిచారు. కర్నాటక క్రికెట్ సంఘం, నిర్వహకులు నిర్లక్ష్యంతోనే తొక్కిసలాట జరిగిందని కమిషన్ తేల్చింది.



షేక్ హ్యాండ్ పై ఆలోచిస్తాం

పొట్టి ప్రపంచకప్‌లో అసలైన సమరానికి కౌంట్‌డౌన్ మొదలైంది. కొలంబోలో ఆదివారం రాత్రి 7:30 గంటలకు భారత్, పాకిస్థాన్ మ్యాచ్ జరుగనుంది. హై ఓల్టేజ్ మ్యాచ్‌లో ఇరుజట్ల సారథులు షేక్ హ్యాండ్ ఇచ్చుకుంటారా? లేదా? అనేది ఆసక్తి రేపుతోంది. శనివారం మీడియా కాన్ఫరెన్స్‌లో పాక్ సారథి సల్మాన్ అఘా ఈ విషయంపై సమాధానం దాటవేశాడు. భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సైతం 'షేక్‌హ్యాండ్ ఉంటుందా?' అనే ప్రశ్నకు ఇంకా 24 గంటలు సమయం ఉందిగా.. రేపు చూద్దాం అని ఉత్కంఠను పెంచేశాడు. ప్రపంచకప్‌లో జోరుమీదున్న భారత్, పాకిస్థాన్‌కు కొలంబో మ్యాచ్ చాలా కీలకం. రెండేసీ విజయాలతో సూపర్ 8కు చేరువలో ఉన్న ఇరుజట్లు గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగనున్నాయి. విజయంపై ధీమాతో టీమిండియా ఉండగా.. చరిత్రను మార్చలేమేని, గొప్పగా ఆడేందుకు ప్రయత్నిస్తామని పాక్ సారథి పేర్కొన్నాడు. చిరకాల ప్రత్యర్థితో మ్యాచ్ సన్నద్ధతపై మాట్లాడినా సూర్యకుమార్ యాదవ్ పలు అంశాలు ప్రస్తావించాడు. అభిషేక్ శర్మ కోలుకున్నాడు. పాక్‌తో మ్యాచ్‌లో అతడు తుది జట్టులో ఉంటాడు. పాక్ కెప్టెన్ వ్యాఖ్యలపై స్పందించిన సూర్య.. మేము రేపు అభిషేక్‌ను ఆడించాలని సల్మాన్ కోరుకుంటున్నట్టున్నాడు. అలాగే చేద్దాం అని బదులిచ్చాడు. సిలబస్‌లో లేని ప్రశ్న ఎదురైనా మనం వదిలేయకూడదు. తారీఖ్ భిన్నమైన బౌలర్. మేము అతడికి లొంగిపోం. ఎదుర్కొనేందుకు ఆతృతగా ఉన్నాం. అన్నారు.





సూపర్ 8 రేసులో ఇంగ్లండ్

టీ20 ప్రపంచకప్‌లో ఇంగండ్ మళ్లీ పుంజుకుంది. వెస్టిండీస్ చేతిలో కంగుతిన్న బ్రూక్ సేన.. ఉత్కంఠ పోరులో స్కాట్లాండ్‌పై విజయంతో సూపర్ 8 రేసులోకి దూసుకొచ్చింది. హిట్టర్లతో నిండిన ఇంగ్లండ్‌ను స్కాట్లాండ్ బౌలర్లు బెంబేలెత్తించి సవాల్ విసిరారు. ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా టామ్ బ్యాంటన్(63 నాటౌట్) సమయోచితంగా ఆడాడు. 19వ ఓవర్లో విల్ జాక్స్ (16 నాటౌట్) 4, 6 బాదడంతో 5 వికెట్ల తేడాతో గెలిచింది. లీగ్ దశలో రెండో విజయంతో సూపర్ 8 అవకాశాల్ని మెరుగు పరుచుకుంది. పదో సీజన్ పొట్టి ప్రంచకప్‌లో ఆస్ట్రేలియాపై జింబాబ్వే విజయం ఓ సంచలనం. శనివారం స్కాట్లాండ్ సైతం రెండుసార్లు ఛాంపియన్ ఇంగ్లండ్‌కు షాకిచ్చేలా కనిపించింది. కానీ, టామ్ బ్యాంటన్(63 నాటౌట్) ఒంటరి సైనికుడులా పోరాడి జట్టుకు ఓటమిని తప్పించాడు. 153 పరుగుల ఛేదనలో తొలి ఓవర్లోనే మెక్‌ముల్లెన్ (123) డేంజరస్ ఓపెనర్ ఫిల్ సాల్ట్(2)ను ఔట్ చేసి ఇంగ్లండ్‌కు షాకిచ్చాడు. రెండో ఓవర్లో జోస్ బట్లర్(3) సైతం డగౌట్ చేరగా.. బ్యాంటన్, జాకబ్ బెథెల్(32) మూడో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఇంగ్లండ్‌ను గెలుపు దిశగా నడిపిస్తున్న ఈ ద్వయాన్ని డేవిడ్‌సన్ విడదీశాడు. బెథెల్ ఔటయ్యాక.. హ్యారీ బ్రూక్(4), సామ్ కరన్(28) సాయంతో బ్యాంటన్ పోరాడి స్కాట్లాండ్ ఆశలపై నీళ్లు చల్లాడు. 17 బంతుల్లో 15 పరుగులు అవసరమైన దశలో విల్ జాక్స్(16 నాటౌట్) ధనాధన్ ఓడించడం గ్లండ్ ఓటమిని తప్పించుకుంది. అంతకుముందు ఆదిల్ రషీద్(336) స్పిన్ ధాటికి స్కాట్లాండ్ బ్యాటర్లు చేతులెత్తేశారు. మైఖేల్ జోన్స్(33), రిచీ బెరింగ్టన్(49)ల మెరుపులతో ఆ జట్టు 152 పరుగులు చేయగలిగింది. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్(224), లియాం డాసన్(234)లు రెండేసీ వికెట్లతో రాణించారు.



కాంస్యం గెలిచిన తెలంగాణ షూటర్

ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ షూటర్ ధవళిక దేవి కాంస్య పతకంతో మెరిసింది. శుక్రవారం జరిగిన మహిళల 50మీటర్ల జూనియర్ రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో ధవళిక అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన తుదిపోరులో ఈ తెలంగాణ షూటర్ 614.1 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం కైవసం చేసుకుంది. ఇదే విభాగంలో తొమిరిస్ అమనోవా(620.1), దరా పొనోమరెంకో(615.4) వరుసగా స్వర్ణ, రజత పతకాలు దక్కించుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని గగన్ నారంగ్ షూటింగ్ అకాడమీలో కోచ్ వినోద్ కనోజియా దగ్గర గత మూడేండ్ల నుంచి ధవళిక దేవి శిక్షణ పొందుతున్నది. మరోవైపు పురుషుల 25మీటర్ల సెంటర్ ఫైర్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన అమన్‌ప్రీత్‌సింగ్ 589 పాయింట్లతో పసిడి పతకంతో మెరిశాడు. ఇదే విభాగంలో గుర్‌ప్రీత్‌సింగ్ (584), అంకుర్ గోయల్ (570) రజత, కాంస్యాలు కైవసం చేసుకుని క్లీన్‌స్వీప్ చేశారు. అదే జోరు కొనసాగిస్తూ టీమ్ ఈవెంట్‌లోనూ అమన్‌ప్రీత్, గుర్‌ప్రీత్‌సింగ్, అంకుర్ త్రయం 1743 పాయింట్లతో స్వర్ణం దక్కించుకోగా, వియత్నాం(1671) రజతం వశం చేసుకుంది. టోర్నీ మొత్తంగా భారత్ 13 స్వర్ణాలు సహా 11 రజతాలు, 9 కాంస్యాలు ఖాతాలో వేసుకుంది.



నాగబంధం నుంచి బైరాగిగా గరుడ రామ్ ఫస్ట్ లుక్ రిలీజ్

విరాట్ కర్ణ హీగా అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'నాగబంధం'. ఈ చిత్రం పాన్‌ఇండియాలో గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతున్న తరుణంలో టీం ప్రమోషన్‌లను ముమ్మరం చేసింది. ఫస్ట్‌లుక్ పోస్టర్లు ఇప్పటికే సంచలనాన్ని సృష్టించాయి. ఈ చిత్ర టీజర్‌ను రేపు మహా శివరాత్రి శుభ సందర్భంగా సూపర్‌స్టార్ మహేష్ బాబు లాంచ్ చేయనున్నారు. టీజర్ మీడియా ప్రీమియర్ ఇప్పటికే జరిగింది. విజువల్స్, స్టోరీ టెల్లింగ్, వరల్డ్ బిల్డింగ్ అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ రోజు మేకర్స్, KGF ఫేమ్ గరుడ రామ్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేస్తూ ఆయన పాత్ర బైరాగిని పరిచయం చేశారు. బూడిదతో అలంకరించిన శరీరం, జటలతో కూడిన ఆతన లుక్ మిస్టికల్ టచ్ ఇచ్చింది. ఇంటెన్స్ లుక్స్, రుద్రాక్షలు, ఎముకలతో చేసిన మాలలు ఆయనను శక్తివంతమైన తాంత్రిక యోధుడిగా చూపిస్తున్నాయి. గరుడ రామ్ చేతిలో కపాలాలు, ఎముకలు, పాములతో అలంకరించిన భారీ దండ కనిపిస్తూ, చీకటి, నిషిద్ధ శక్తులను సూచిస్తోంది. అడవి, పాములు, చెల్లాచెదురుగా ఉన్న కపాలాలు మరింత క్యూరియాసిటీ పెంచుతున్నాయి. కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్న 'నాగబంధం'లో నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలుగా నటిస్తుండగా, జగపతి బాబు, జయప్రకాష్, మురళి శర్మ, బి.ఎస్. అవినాష్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సౌందర్ రాజన్ ఎస్ సినిమాటోగ్రఫీ, ఆర్‌సి ప్రణవ్ ఎడిటింగ్, అశోక్ కుమార్ ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్న ఈ విజువల్ వండర్ ప్రేక్షకులను మెస్మరైజ్ చేయడానికి సిద్ధంగా ఉంది.

'ఏమో ఏమో ఇది'

దర్శకుడు డా. శైలేష్ కొలను, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నాగవంశీ సరికొత్త రొమాంటిక్ కామెడీ సినిమా కోసం చేతులు కలిపారు. రోషన్ మేకా, ప్రీతి ముకుందన్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి 'ఏమో ఏమో ఇది' అనే అందమైన టైటిల్ ను ఖరారు చేశారు. ప్రేమికుల దినోత్సవం కానుకగా టైటిల్ తో పాటు గ్లింప్స్ ను ఆవిష్కరించారు. "ఏమో ఏమో ఇది" అనే టైటిల్ వినగానే ఉల్లాసమైన ప్రేమ భావనలు మనసులో మెదులుతున్నాయి. చిత్ర ప్రకటన సందర్భంగా విడుదల చేసిన గ్లింప్స్ తల్లి-కొడుకుల మధ్య సరదా సంభాషణతో ప్రారంభమవుతుంది. నవతరం ప్రేమ బంధాలు, ఆధునిక వివాహాలు వంటి అంశాలను వినోదాత్మకంగా చూపించారు. గ్లింప్స్‌లో కథానాయిక తన ప్లేలిస్ట్‌లోని అలనాటి క్లాసిక్ పాటను ఆస్వాదిస్తూ కనిపిస్తుంది. ఆ సన్నివేశం ద్వారా ఆమె లోతైన భావోద్వేగ అనుబంధాన్ని, ప్రేమను ఎంతో అందంగా ఆవిష్కరించారు. బ్లాక్‌బస్టర్ 'హిట్' యూనివర్స్‌తో గుర్తింపు పొందిన దర్శకుడు శైలేష్ కొలను, "ఏమో ఏమో ఇది" ద్వారా పూర్తిగా కొత్త జానర్‌లో అడుగుపెడుతున్నారు. ఇదే ఆయన తొలి రొమాంటిక్ కామెడీ చిత్రం. ఇంతకుముందు తీవ్రత, యాక్షన్‌తో కూడిన ఉత్కంఠభరిత ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్లను అందించిన ఆయన, ఇప్పుడు హృద్యమైన, హాయిగా సాగే, సరదాగా నవ్వించే సరికొత్త ప్రేమ కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అభయ్ పాత్రలో రోషన్ మేకా నటిస్తున్నారు. తొలి చిత్రం 'పెళ్లి సందడి' ద్వారా ఆకట్టుకున్న ఆయన, ఇటీవల 'ఛాంపియన్' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు ఈ 'ఏమో ఏమో ఇది' చిత్రంలో నేటి జెన్ జీ తరం ప్రేమను ఆవిష్కరించే పక్కింటి అబ్బాయి తరహా ఆకర్షణీయమైన పాత్రలో రోషన్ కనిపించనున్నారు. అపూర్వ పాత్రలో ప్రీతి ముకుందన్ కనిపించనున్నారు. గ్లింప్స్‌లోనే ఆమె ఉత్సాహభరితమైన స్క్రీన్ ప్రెజెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అపూర్వ పాత్రలో సరికొత్తగా కనిపిస్తూ తెలుగు ప్రేక్షకుల హృదయాలను దోచుకోవడానికి సిద్ధమవుతున్నారు.





వరలక్ష్మి శరత్ కుమార్ 'సరస్వతి' ఫస్ట్ లుక్

వెర్సటైల్ పాత్రలతో అలరిస్తున్న వరలక్ష్మి శరత్ కుమార్ స్వీయ దర్శకత్వంలో, తన సోదరి పూజా శరత్ కుమార్ తో కలిసి దోస డైరీస్ బ్యానర్ పై నిర్మిస్తున్న చిత్రం 'సరస్వతి'. హైకాన్సెప్ట్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ పోస్టర్ ప్రేక్షకులలో క్యూరియాసిటీ పెంచింది. తాజాగా హీరోయిన్ సమంత ఈ చిత్రం ఫస్ట్ లుక్ లాంచ్ చేశారు. తెల్లని క్రాక్ టెక్స్చర్ బ్యాక్‌డ్రాప్ మధ్యలో ఎరుపు చీరలో ధైర్యంగా నడుస్తున్న రలక్ష్మి శరత్ కుమార్ కథలోని బలంభావోద్వేగాలను హైలైట్ చేసినట్టుగా కనిపిస్తోంది. వెనుక భాగంలో బ్లాక్ అండ్ వైట్ షేడ్స్‌లో కనిపించే పాత్రల సిల్హౌట్స్ కథలోని ఇంటెన్స్ సూచిస్తున్నాయి. స్ట్రాంగ్ విజువల్ ఎలిమెంట్స్‌తో రూపొందిన ఈ పోస్టర్ క్యూరియాసిటీ పెంచింది. ఈ చిత్రంలో జీవా, ప్రకాష్ రాజ్, నాజర్, ప్రియమణి, రాధిక వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. సంగీత సంచలనం థమన్ ఎస్ సంగీతం అందిస్తుండగా, ఎ.ఎం. ఎడ్విన్ సకే కెమెరా మ్యాన్. వెంకట్ ఎడిటర్, సుధీర్ ఆర్ట్ డైరెక్టర్. ప్రవీణ్ డేనియల్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. మేకర్స్ త్వరలోనే ప్రమోషన్స్ ని కిక్ స్టార్ట్ చేయబోతున్నారు.



'నేను రెడీ' సమ్మర్ లో రిలీజ్

యంగ్ హీరో హవిష్, బ్లాక్ బస్టర్ డైరెక్టర్ త్రినాధ రావు నక్కినతో కలసి కంప్లీట్ ఎంటర్టైనర్ 'నేను రెడీ' చేస్తున్నారు. హర్నిక్స్ ఇండియా LLP బ్యానర్‌పై నిఖిల కొనేరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో హవిష్ సరసన కావ్య థాపర్ కథానాయికగా నటిస్తోంది. పోస్టర్లు, టైటిల్, టీజర్ గ్లింప్స్ తో ఇప్పటికే సినిమా మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రం వేసవిలో ప్రేక్షకులు ముందుకు రాబోతుంది. పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రంగా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా డైరెక్టర్ త్రినాథరావు" నేను రెడీ " ని సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శర వేగంగా జరుగుతున్నాయి. మేకర్స్ వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ చేసిన స్పెషల్ పోస్టర్ లో హవిష్, కావ్య థాపర్ చిరునవ్వులతో కనిపించడం ఆకట్టుకుంది. ఈ సినిమాలో బ్రహ్మనందం, వెన్నెల కిషోర్, మురళీ శర్మ, శ్రీలక్ష్మి, జిటివి గణేష్, రోహిణి, హరితేజ వంటి ప్రముఖ తారాగణం ప్రేక్షకులకు నవ్వులు పూయించేందుకు రెడీ అయ్యారు. స్టార్ కంపోజర్ మిక్కీ జె మేయర్ ఈ సినిమాకు స్వరాలను అందించారు. నిజార్ షఫీ డీవోపీగా, ప్రవీణ్ పూడి ఎడిటర్ గా పని చేస్తున్నారు.



'విష్ణు విన్యాసం' ఫిబ్రవరి 28న రిలీజ్

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ 'విష్ణు విన్యాసం'తో థియేటర్లలో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు యదునాథ్ మారుతీ రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నయన సారిక కథానాయికగా నటించింది, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మించారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 28న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. శ్రీ విష్ణు ఫంకీ ప్రింటెడ్ షార్ట్స్, కలర్ ఫుల్ చొక్కా, షేడ్స్ ధరించిన క్లాసిక్ బైక్‌పై విశ్రాంతి తీసుకుంటున్నట్లు అదిరిపోయే వైబ్ తో కనిపించిన అనౌన్స్మెంట్ పోస్టర్ అదిరిపోయింది. విష్ణు విన్యాసం ఫన్, కలర్ ఫుల్ సినిమాటిక్ రైడ్ గా ఉండబోతోంది. శ్రీవిష్ణు విచిత్రమైన నమ్మకాలు, జాతకాలని నమ్మే యువకుడి పాత్రలో అలరించబోతున్నారు. ప్రమోషన్‌లు ఇప్పటికే జోరందుకున్నాయి, టైటిల్ గ్లింప్స్, పెప్పీ ఇంట్రడక్టరీ ట్రాక్. వాలెంటైన్స్ డే రొమాంటిక్ సింగిల్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రంలో సత్య, బ్రహ్మాజీ, ప్రవీణ్, మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, సత్యం రాజేష్, శ్రీనివాస్ వడ్లమాని, గోపరాజు రమణ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రధన్ సంగీతం సమకూరుస్తున్నారు, సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు, ఎ రామాంజనేయులు ఆర్ట్ డైరెక్టర్‌గా, కార్తికేయన్ రోహిణి ఎడిటర్‌గా పని చేస్తున్నారు. రిలీజ్ డేట్ అనౌన్స్ చేయడంతో నిర్మాతలు మరింత జోరుగా చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200